www.epaper.asthram.com

# సామాన్యుడి అస్త్రం

తెలుగు దినపత్రిక

శనివారం 15 నవంబర్ 2025

సంగారెడ్డి సంచిక : 78 సంపుటి : 1 పేజీలు : 8 వెల : రూ. 5/-

## 7300ఎంఏహెచ్ బ్యాటరీతో వన్‌ప్లస్ 15 విడుదల

చైనాకు చెందిన వన్‌ప్లస్ తన ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్ వన్‌ప్లస్ 15ను భారత మార్కెట్లో విడు దల చేసింది. క్వాల్‌కమ్ కొత్త స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ జెన్5 ప్రాసెసర్‌తో తీసుకొచ్చిన మొట్టమొదటి స్మార్ట్‌ఫోన్ వన్‌ప్లస్ 15 అని, సొంత డిటైల్‌మ్యాక్స్ ఇంజిన్‌తో ట్రిపుక్ 50ఎంపీ రేర్ కెమెరాతో ఇది వస్తుందని కంపెనీ వెల్లడించింది. ఈ ఫోన్ ఆండ్రాయిడ్ 16-ఆధారిత ఆక్సిజన్ ఓఎస్16తో పనిచేస్తుంది. దేశీయంగా మార్కెట్లో దీని ప్రారంభ ధర రూ. 72,999 నుంచి ఉండనుంది. రాత్రి 8 గంటల నుంచి ఇది అందుబాటులోకి తెచ్చినట్టు కంపెనీ వెల్లడించింది.



# ఎన్డీయే సునామీ

### బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ%-%జేడీ(యూ) కూటమి ప్రభంజనం

### 243 స్థానాలకు గాను 202 స్థానాలు కైవసం

### 35 సీట్లకే పరిమితమైన విపక్ష మహాగఠ్‌బంధన్.. బీజేపీకి 89, జేడీ(యూ)కి 85 సీట్లు

### 25 స్థానాల్లో ఆర్జేడీ, ఆరు స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు

### చిరాగ్ పాశ్వాన్ పార్టీకి 19 సీట్లు... 5 సీట్లలో ఎంఐఎం జయకేతనం

### సున్నా చుట్టేసిన ప్రశాంత్ కిశోర్ జన్ సురాజ్ పార్టీ

### ప్రజాస్వామ్య విజయంగా అభివర్ణించిన ప్రధాని నరేంద్ర మోదీ

*89 సీట్లలో జయకేతనం ఎగురవేసిన బీజేపీ ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. మిత్రపక్షమైన జేడీ(యూ)ను వెనక్కి నెట్టి, కూటమి పెద్దన్నగా మారింది. కాంగ్రెస్, ఆర్జేడీలతో కూడిన మహాగఠ్‌బంధన్ పూర్తిగా కుదేలయ్యింది. కేవలం 35 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇక ఎన్నికల వ్యూహకర్తగా పేరుగాంచిన ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన సురాజ్ పార్టీ గుండుసున్నా చుట్టేసింది. ఘోర పరాజయం పాలయ్యింది.*



### జూబ్లీహిల్స్‌లో

## కాంగ్రెస్ ఘన విజయం

నవీన్ యాదవ్ గెలుపును అధికారికంగా ప్రకటించిన ఈసీ...

24,729 ఓట్ల మెజార్టీతో నవీన్ యాదవ్ గెలుపు



## బిహార్‌లో అతిపెద్ద పార్టీగా బీజేపీ

- ప్రధాని మోదీ ట్వీట్
- ఎన్డీఏ విజయభేరి మోగించింది
- బిహార్‌లో ఎన్డీయే విజయం అపూర్వం, చరిత్రాత్మకం
- పతిపక్షాల అబద్దాలను మా కార్యకర్తలు తిప్పికొట్టారు.


## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కొత్త ఉత్సాహం బలాన్నిచ్చింది

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నియోజకవర్గ స్థానిక నాయకత్వం అద్భుతంగా కష్టపడింది
- వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు
- ప్రజా సమస్యలను ప్రభుత్వం ముందు పెట్టడంలో బలంగా బీఆర్ఎస్ పనిచేస్తుంది
- భవిష్యత్తులో ఇది కొనసాగుతుంది
- ఎన్నికల్లో ఓడిపోయామని నిరాశ లేదు.. బలంగా తిరిగొస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తమకు కొత్త ఉత్సాహం, బలాన్నిచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం బీఆర్ఎస్ ఒక్కటే అని ప్రజలు స్పష్టంగా తీర్పునిచ్చారని తెలిపారు. ఇది నిజంగా తమకు సానుకూలమైన అంశమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా .. నియోజకవర్గ స్థానిక నాయకత్వం అద్భుతంగా కష్టపడిందని అన్నారు. వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి - మిగతా3లో



## భారత్‌తో భాగస్వామ్యం ప్రపంచానికే లాభం

- విశాఖలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్
- భారత్‌తో భాగస్వామ్యం ప్రపంచానికి మేలు చేస్తుందన్న పీయూష్ గోయల్
- విశాఖ సీఐఐ సదస్సులో పాల్గొన్న కేంద్ర మంత్రి, సీఎం చంద్రబాబు
- పెట్టుబడులకు భారత్ ప్రాధాన్య గమ్యస్థానంగా మారిందన్న చంద్రబాబు
- తూర్పు తీరంలో ఏపీ ఒక ముఖద్వారం లాంటిదని ముఖ్యమంత్రి వ్యాఖ్య
- తమది డబుల్ ఇంజిన్, బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వమన్న మంత్రి నారా లోకేశ్
- సాంకేతికత, విశ్వాసం, సామర్థ్యంపైనే భారత్ దృష్టి సారించిందని గోయల్ వెల్లడి

## ఈ ఫలితాలు భూకంపం ముందొచ్చే హెచ్చరికలాంటివి

- ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు మా ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది
- "ఈ గెలుపు నా బాధ్యతను మరింతగా పెంచింది
- హైదరాబాద్ ప్రజలు మాకు అండగా నిలిచారు
- బాధ్యతతో ముందుకు వెళ్ళమని మమల్ని ప్రజలు ఆశీర్వదించారు
- గెలుపులో భాగమైన అందరికీ ధన్యవాదాలు కృతజ్ఞతలు
- గెలుపులో అండగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ధన్యవాదాలు
- ఈ గెలుపు రెండేళ్ల కాంగ్రెస్ పాలనకు రెఫరెండం



హైదరాబాద్

ప్రజలు సంక్షేమానికి పట్టం కట్టారని.. ఈ గెలుపు రెండేళ కాంగ్రెస్ పాలనకు రెఫరెండం అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక గెలుపుపై ఆయన స్పందిస్తూ.. జూబ్లీహిల్స్‌లో విజయం అందించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు మా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. "ఈ గెలుపు నా బాధ్యతను మరింతగా పెంచింది. హైదరాబాద్ ప్రజలు మాకు అండగా నిలిచారు. బాధ్యతతో ముందుకు వెళ్ళమని మమల్ని ప్రజలు ఆశీర్వదించారు. గెలుపులో భాగమైన అందరికీ ధన్యవాదాలు కృతజ్ఞతలు. గెలుపులో అండగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ధన్యవాదాలు. ఎన్నికల్లో నెగ్గితే ఉప్పొంగిపోవడం, ఓడిపోతే కుంగిపోవడం మాకు తెలియదు. ప్రతిపక్షంలో ఉంటే ప్రజల కోసం పోరాటంలో భాగం అవుతాం. అధికారంలో ఉంటే ప్రజల సమస్యలను పరిష్కరిస్తాం. దశాబ్ద కాలంగా - మిగతా3లో

# ఎన్డీయే సునామీ

బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ముందు పాట్నాలోని జనతాదళ్ (యునైటెడ్) కార్యాలయం వెలుపల వెలసిన ఓ భారీ పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షించింది. "టైగర్ అభీ జిందా హై" (పులి ఇంకా బతికే ఉంది) అన్నదే దాని సారాంశం. శుక్రవారం ఓట్ల లెక్కింపు ప్రారంభమై, ఫలితాల సరళి వెలువడుతున్న కొద్దీ ఆ నినాదం కేవలం ప్రచారం కోసం కాదని, బీహార్ రాజకీయాల్లో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ చెక్కుచెదరని శక్తికి నిదర్శనమని స్పష్టమవుతోంది. ఎన్నికల సంఘం వెల్లడిస్తున్న ట్రెండ్స్ ప్రకారం, ఎన్డీఏ కూటమి స్పష్టమైన ఆధిక్యంతో దూసుకుపోతోంది. మొత్తం 243 స్థానాలున్న అసెంబ్లీలో, మ్యాజిక్ ఫిగర్ 122 కాగా, ఎన్డీఏ మధ్యాహ్నం 2:30 గంటల సమయానికే 200కు పైగా స్థానాల్లో ఆధిక్యంలో నిలిచింది. ఈ భారీ ఆధిక్యం కేవలం కూటమి లెక్కలనే కాకుండా, బీహార్‌లో ఎన్డీఏకు నితీశ్ కుమారే అసలైన గుర్తింపు అనే వాస్తవాన్ని మరోసారి రుజువు చేసింది.




**'జంగిల్ రాజ్' నుంచి సుపరిపాలన వైపు..**

1951లో పాట్నా జిల్లాలోని భక్తియార్‌పూర్‌లో ఓ సాధారణ కుటుంబంలో నితీశ్ కుమార్ జన్మించారు. ఆయన తండ్రి కవిరాజ్ రామ్ లఖన్ సింగ్ ఆయుర్వేద వైద్యుడు, స్వాతంత్ర్య సమరయోధుడు. బిహార్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (ప్రస్తుతం ఎన్ఐటీ పాట్నా) నుంచి ఇంజినీరింగ్ పట్టా పొందిన ఆయన, జేపీ ఉద్యమం స్ఫూర్తితో సోషలిస్టు రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. కేంద్ర మంత్రిగా పలు శాఖలు నిర్వహించి, చివరకు బిహార్ ముఖ్యమంత్రిగా తనదైన ముద్ర వేశారు. నితీశ్ పాలన గురించి చెప్పాలంటే, 2005కు ముందు రాష్ట్రాన్ని పట్టిపీడించిన 'జంగిల్ రాజ్'ను ప్రస్తావించాల్సిందే. లాలూ ప్రసాద్ యాదవ్ పాలనలో (1990-2005) బీహార్ అరాచకానికి, కుల ఘర్షణలకు, రాజకీయ నేరాలకు కేంద్రంగా మారింది. "భూరాబల్ సాఫ్ కరో" (భూమిహార్, రాజ్‌పుత్, బ్రాహ్మణ, లాలా అనే నాలుగు అగ్ర కులాలను తుడిచిపెట్టండి) వంటి నినాదాలు ఆ కాలంలోనే పుట్టుకొచ్చాయి. అలాంటి భయానక వాతావరణం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించి, శాంతిభద్రతలను నెలకొల్పిన ఘనత నితీశ్‌కే దక్కుతుందని విశ్లేషకులు చెబుతారు.

**విమర్శలను తట్టుకుని..**

"శారీరకంగా అలసిపోయారు, మానసికంగా రిటైర్ అయ్యారు" అంటూ జన్ సూరజ్ పార్టీ నేత ప్రశాంత్ కిశోర్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వంటి వారు నితీశ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన బీజేపీకి కేవలం ఒక 'మాస్క్'గా మిగిలిపోయారని ఆరోపించారు. అయితే ఈ ఎన్నికల ఫలితాలు ఆ విమర్శలను పటాపంచలు చేశాయి. మహిళలు రికార్డు స్థాయిలో ఓటింగ్‌లో పాల్గొనడం (తొలి దశలో 69%, రెండో దశలో 74%), ఈబీసీ/మహాదళితుల వంటి బలమైన సామాజిక వర్గాలు ఆయన వెంటే నిలవడం నితీశ్ గెలుపులో కీలక పాత్ర పోషించాయి. 2016లో సంపూర్ణ మద్యపాన నిషేధం, మహిళా విద్యకు ప్రోత్సాహం, రహదారుల నిర్మాణం, గ్రామీణ సేవలు, సంక్షేమ పథకాలు వంటివి ఆయన పాలనకు బలాన్నిచ్చాయి. తన రాజకీయ ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశారు. బీజేపీతో పొత్తు, ఆ తర్వాత విడిపోవడం, 2014 లోక్‌సభ ఎన్నికల్లో కేవలం రెండు సీట్లకే పరిమితమవడం వంటివి ఆయనకు ఎదురుదెబ్బలే. అయినా తన రాజకీయ చాతుర్యంతో మళ్లీ నిలదొక్కుకుని రికార్డు స్థాయిలో 9వ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిలో జేడీ(యూ) కన్నా బీజేపీ ఎక్కువ స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. ఇది కూటమిలో బీజేపీ 'పెద్దన్న' పాత్ర పోషిస్తోందనడానికి సంకేతం. అయినప్పటికీ, బిహార్‌లో ఎన్డీఏ విజయానికి నితీశ్ కుమారే చోదకశక్తి అని, ఆ కూటమికి ఆయనే మస్కట్ అని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.

# మహిళలే 'కింగ్ మేకర్స్'

ఎంతో ఉత్కంఠ మధ్య కొనసాగుతున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఎన్డీయే కూటమి ఘన విజయం దిశగా దూసుకుపోతోంది. ప్రస్తుత ట్రెండ్స్ ఫలితాల్లోకి మారితే, నితీష్ కుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఎన్డీయే అధికారికంగా సీఎం అభ్యర్థిగా ఆయన పేరు ప్రకటించనప్పటికీ, నాయకులు ఆయనే సీఎం అని గట్టిగా నమ్ముతున్నారు. అయితే ఎన్డీయే విజయభేరి వెనుక రహస్యం ఏంటి అనేది చర్చనీయాంశంగా మారింది. నవంబర్ 14న జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల లెక్కింపులో నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ మెజారిటీ మార్కును దాటింది, ఎగ్జిట్ పోల్స్ అంచనాలకనుగుణంగా నితీశ్ కుమార్ నాయకత్వానికే ప్రజలు మొగ్గు చూపారు. కాంగ్రెస్-ఆర్జేడీ నేతృత్వంలోని మహాఘట్‌బంధన్‌కు ఘోర పరాభవం తప్పలేదు. బిహార్ సీఎంకోసం తేజస్వి కలలు కల్లలయ్యాయ.



**రికార్డ్ ఓటింగ్**

బిహార్ ఈసారి ఓటింగ్ రికార్డులను బద్దలు కొట్టింది. ఈ సారి నమోదైన రికార్డ్ఓటింగ్‌ను ఎన్డీయే విజయానికి మార్గం సుగమం చేసింది. 60 శాతం అధిక పోలింగ్ శాతం ఉంది. చిన్న పోలింగ్ కేంద్రాలు, సవరించిన ఎన్నికల జాబితా యాక్సెస్ ఓటింగ్ శాతాన్ని పెంచిందంటున్నారు అధికారులు. అలాగే ముఖ్యంగా బలమైన స్థానిక సంబంధాలు ఉన్న అభ్యర్థుల ఎంపిక కూడా అధిక ఓటింగ్‌కు కారణమని భావిస్తున్నారు.

**మహిళా సంక్షేమం, యువకులు**

మహిళలు యువ ఓటర్ల బలమైన భాగస్వామ్యం కీలక ఫలితాలను నిర్ణయించడంలో కీలకమైనదని, ఇదే రాబోయేప్రభుత్వ విధాన ప్రాధాన్యతలను రూపొందిస్తుందని విశ్లేషకులు సూచిస్తున్నారు. ముఖ్యంగా 'దశజారీ' ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గర్ యోజన పథకం ప్రకటించిన తర్వాత మహిళలు భారీ సంఖ్యలో ఓటు వేశారు. వివిధ ప్రాంతాలలో పురుషుల కంటే మహిళల ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదైంది. పురుషుల కంటే 5 లక్షల మంది మహిళలు ఓటు వేయడంరికార్డు స్థాయిలో ఓటింగ్‌కు దారితీసింది.

మహిళా రోజ్‌గార్ యోజన కింద 1.4 కోట్ల మహిళలకు రూ. 10,000 నగదు, ఉచిత సైకిల్ పథకం, పంచాయతీల్లో 50శాతం రిజర్వేషన్, ప్రభుత్వ ఉద్యోగాల్లో 35శాతం రిజర్వేషన్, ఉచిత విద్యుత్ లాంటి వాటితోపాటు, మహిళా సంక్షేమ పథకాల కింద రూ.2 లక్షల సాయం లాంటి హామీలు భారీ ప్రభావాన్ని చూపాయని అంచనా. అలాగే కుల సమీకరణాల్లో ఎన్డీయే ఆధిపత్యాన్ని చాటుకుంది. అగ్ర కులాలలో 10శాతం కుష్వాహాలలో 4శాతంకంటే ఎక్కువ, పాశ్వాన్లలో 5శాతం కంటే ఎక్కువ, ముసాహర్లలో 3శాతం కంటే ఎక్కువ,మల్లాలలో 2.6శాతం వంటి విభిన్న వర్గాల మద్దతును కూడగట్టింది.

**ఎస్ఐఆర్ వివాదం**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ల జాబితాలపై గందరగోళం, సామూహిక తొలగింపు ఆరోపణలు ఉన్నప్పటికీ, చాలా ప్రాంతాలలో రికార్డు స్థాయిలో పోలింగ్ శాతం, సజావుగా జరిగిన ఓటింగ్ ఈ ప్రభావ పెద్దగా లేదని తెలిపింది. అలాగు కేంద్రం బిహార్‌కు కేటాయించిన 1.62 లక్షల కోట్ల అభివృద్ధి ప్యాకేజీలు, ఎక్స్‌ప్రెస్‌వేలు, మౌలిక సదుపాయాల మెరుగుదల లాంటివాటిని బాగా ప్రచారంలో పెట్టుకోవడంతో ఇది బాగా కలిసి వచ్చింది.

**'మోదీ హనుమాన్' చిరాగ్**

చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని రామ్ విలాస్ పార్టీ 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పెద్ద సంచలనంగా చెప్పవచ్చు. 2020లో కేవలం ఒక సీటు మాత్రమే గెలుచుకుని ఒకప్పుడు రద్దైన ఆపార్టీ, అనూహ్యంగా ఈఎన్నికల్లో పుంజుకుంది. ప్రస్తుత ట్రెండ్స్ ప్రకారం 22 సీట్లలో ఆధిక్యంలో ఉంది.

**మోదీ మ్యాజిక్**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చార్మ్, చాణక్యం అప్రతిహతంగా కొనసాగుతోంది. అసాధారణమైన 2024 లోక్‌సభ ఎన్నికలు మొదలు హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీలను కైవసం చేసుకునే మోదీ హవా ప్రత్యేకంగా నిలుస్తోంది. ఇపుడు బిహార్ మరో ప్రధాన విజయంగా మారనుంది.

**ఫోనిక్స్ సీఎం నితీశ్ రాజకీయాలు**

సంక్షేమం ఈ ఎన్నికలను నిర్వచించింది. ఓటర్లు తాజా వాగ్దానాల కంటే వారు ఇప్పటికే అనుభవించిన పథకాలను - రుణ బదిలీలు, పెన్షన్లు, మహిళా కేంద్రీకృత మద్దతు లాంటి పథకాలు వారిని మెప్పించాయి. సంక్షేమ విశ్వసనీయత, స్థిరమైన ప్రభుత్వంగా నితీష్ ప్రభుత్వాన్ని విశ్వసించడంతో ప్రభుత్వ వ్యతిరేకత బలహీనపడి, విజయభేరీ దిశగా నడిపించింది. 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు ఒక విధంగా లిట్మస్ పరీక్ష. అయితే, గత 20 సంవత్సరాలుగా ప్రతి బిహార్ ఎన్నికలలోనూ నితీష్ కుమార్ శాశ్వత ప్రజాదరణ స్పష్టమైన అభివృద్ధి ,సమ్మిళిత వృద్ధిపై ఆయన దృష్టి ఫలించింది. నితీష్ పాలనా శైలి రెండు దశాబ్దాలకు పైగా అధికారాన్ని నిలబెట్టుకోవడానికి సహాయపడింది. అభివృద్ధి, కలుపుగోలుతనం ఆయనను బీహార్ రాజకీయాల్లో ఒక బలీయమైన శక్తిగా మార్చింది.

## ప్రశాంత్ కిషోర్ రాజకీయ సన్యాసం ?




బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం దిశగా లీడ్‌లో కొన సాగుతోంది. మరోవైపు ప్రఖ్యాత పోల్ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ఇపుడు చర్చల్లో నిలిచాడు. ఒకవైపు ఎన్నికల అరంగేట్రంలో పెద్ద ఎదురు దెబ్బ, మరోవైపు జేడీయూ 25 కంటే ఎక్కువ సీట్లు గెలిస్తే రాజకీయ సన్యాసం పుచ్చుకుంటానన్న పీకే చేసిన వ్యాఖ్యలు ఇపుడు చర్చనీయాంశ మవుతున్నాయి. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో నితీష్ కుమార్ జేడీయూ 25 సీట్లు దాటితే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రశాంత్ కిషోర్ ప్రకటించారు. అలాగే సీఎంగా నితీష్ కుమార్ కుర్చీపై కూర్చోరని కిషోర్ అనేక ఇంటర్వ్యూలలో చెప్పుకొచ్చారు కూడా. కానీ ఆయన అంచనాలన్నీ తల్లకిందులై, కూటమి భారీ మెజార్టీ దిశగా సాగుతోంది. మరి తాజా ఫలితాల నేపథ్యంలో పీకే తన వాగ్దానానికి కట్టుబడి ఉండి రాజకీయాలను వదిలివేస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది. అయితే ఆకాశంలో లేదంటే నేల మీద

ఒక సమయంలో, 243 సీట్ల శాసనసభలో %జీరా% "10 కంటే తక్కువ లేదా 150 కంటే ఎక్కువ అని కూడాజోస్యం చెప్పారు. అటు ఆయన పార్టీ జాన్ సూరాజ్ (జేఎస్పీ) ఖాతా తెరవలేకపోయింది తన పార్టీ అయితే ఆకాశంలో లేదంటే నేలపై ఉంటుందని కూడా అంచనా వేశారు. కాగా బిహార్ శాసనసభలోని 243 సీట్ల కోసం నవంబర్ 6 ,నవంబర్ 11 తేదీలలో రెండు దశల్లో జరిగాయి. రెండు దశల్లో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 67.13 శాతం పోలింగ్ నమోదైంది. 1951 తర్వాత రాష్ట్రంలో అత్యధిక ఓటర్ల పోలింగ్ ఇదే. ఇదే ఎన్టీయే కూటమికి బాగా కలిసి వచ్చింది. ఓట్ల లెక్కింపు ఇంకా కొనసాగుతోంది.

## బిహార్‌లో అతిపెద్ద పార్టీగా బీజేపీ

ఢిల్లీ: బిహార్‌లో అతిపెద్ద పార్టీగా బీజేపీ అవతరించింది. ఎన్డీఏ విజయభేరి మోగించింది. బిహార్‌లో ఎన్డీయే విజయం అపూర్వం, చరిత్రాత్మకం అంటూ ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్ చేశారు. విజయంతో ఆశీర్వదించిన బిహార్ ప్రజలకు కృతజ్ఞతలు అంటూ ఎక్స్ వేదికగా తెలిపారు. "ప్రతిపక్షాల అబద్దాలను మా కార్యకర్తలు తిప్పికొట్టారు. బిహార్ అభివృద్ధి, సాంస్కృతికగుర్తింపునకు కృషి చేస్తాం. బిహార్ తీర్పు నూతన సంకల్పంతో పనిచేయడానికి శక్తినిచ్చింది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు సంబరాలు జరుపుకుంటున్నారు. బిహార్‌లో ఎన్డీఏ సునామీ సృష్టించింది. 200 స్థానాలకు పైగా ఎన్డీఏ అభ్యర్థులు లీడింగ్‌లో కొనసాగుతున్నారు. ఇవాళ ఢిల్లీలో బీజేపీ ఆఫీస్‌కు ప్రధాని మోదీ రానున్నారు.

## భారత్‌తో భాగస్వామ్యం ప్రపంచానికే లాభం




బలమైన ఆర్థిక బంధాలను ఏర్పరుచుకుంటున్న తరుణంలో భారత్‌తో భాగస్వామ్యం కావడం ద్వారా ప్రపంచ దేశాలు ఎంతో ప్రయోజనం పొందుతాయని, ఇది ప్రపంచవ్యాప్తంగా ఉమ్మడి శ్రేయస్సుకు దారితీస్తుందని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీయూష్ గోయల్ మాట్లాడుతూ, నూతన భౌగోళిక-ఆర్థిక క్రమంలో భారత్ తనదైన శైలిలో ముందుకు సాగుతోందని తెలిపారు. సాంకేతికత ద్వారా శ్రేయస్సు, నైతికత ద్వారా విశ్వాసం, సామర్థ్యం ద్వారా వాణిజ్యం అనే మూడు సూత్రాలతో ప్రగతి పథంలో పయనిస్తోందని వివరించారు. అంతర్జాతీయ సహకారాన్ని విస్తృతం చేసేందుకు ఆయన మూడు కీలక సిఫార్సులను ప్రతిపాదించారు. ద్వైపాక్షిక పెట్టుబడులను సులభతరం చేయడం, సాంకేతిక సహకారాన్ని బలోపేతం చేయడం, పరస్పర విశ్వాసాన్ని నిర్మించి, నిలబెట్టుకోవడం అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశ ప్రగతి గాథ విశ్వాసం, పారదర్శకత, ఆవిష్కరణలు, సమ్మిళిత వృద్ధి అనే స్తంభాలపై నిర్మితమైందని గోయల్ కొనియాడారు. ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందుతూ, ప్రతి పౌరుడు ఉన్నత జీవన ప్రమాణాలను పొందేలా, భారత్‌ను ఒక అభివృద్ధి చెందిన, సంపన్న దేశంగా చూడాలన్నదే తమ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. దార్శనిక నాయకత్వం కింద విశాఖ పట్నం గొప్ప వారసత్వం, ఆధునిక ఆవిష్కరణలతో కూడిన ప్రపంచ వాణిజ్య కేంద్రంగా అవతరించిందని, ఇది భారతదేశ వృద్ధి కథను ప్రపంచంతో అనుసంధానిస్తోందని ప్రశంసించారు. పారదర్శక పాలన, దీర్ఘకాలిక భాగస్వామ్యాలను ప్రోత్సహించే విధానాల ద్వారా విశ్వాసాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, దార్శనిక నాయకత్వం, ప్రజాస్వామ్య బలం కారణంగా భారతదేశం ప్రపంచంలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన పెట్టుబడుల గమ్యస్థానంగా ఎదుగుతోందని అన్నారు. వ్యూహాత్మక తీరప్రాంతం, సులభతర వాణిజ్యంలో నిరూపితమైన ట్రాక్ రికార్డుతో ఆంధ్రప్రదేశ్, భారతదేశ తూర్పు తీరంలో ఒక ముఖద్వారంగా (గేట్‌వే) నిలుస్తోందని అభివర్ణించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 11వ స్థానం నుంచి 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతున్న ఈ ప్రయాణంలో, దేశ అప్రతిహత వృద్ధిని, శ్రేయస్సు వాగ్దానాన్ని ఏ శక్తీ అడ్డుకోలేదని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకోవడానికి బలమైన కారణం ఉందని అన్నారు. "మేము డబుల్ ఇంజిన్, బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వాన్ని అందిస్తున్నాం" అని ఆయన వ్యాఖ్యానించారు. తాము ఒక ప్రాజెక్టుకు కట్టుబడితే, అది తమ ఉమ్మడి లక్ష్యంగా మారుతుందని, దానిని సంకల్పంతో ముందుకు తీసుకెళతామని ఆయన హామీ ఇచ్చారు. వ్యాపారాలు కేవలం విజయవంతం కావడమే కాకుండా, వృద్ధి చెందేలా చూసేందుకు అవసరమైన సంస్కరణలను అమలు చేయడానికి కేంద్రంతో కలిసి పనిచేయడానికి తాము పూర్తి సిద్ధంగా ఉన్నామని పెట్టుబడిదారులకు ఆయన భరోసా ఇచ్చారు.

## ఫ్లిప్‌కార్ట్‌కు నకిలీ కస్టమర్లు టోపీ..

## రూ.1.6 కోట్ల విలువైన 332 ఫోన్లు చోరీ



**తిరువనంతపురం:** ఫ్లిప్‌కార్ట్‌ను నకిలీ కస్టమర్లు మోసగించారు. రూ.1.6 కోట్ల విలువైన 332 మొబైల్ ఫోన్లు చోరీ చేశారు. ఈ మోసాన్ని గ్రహించిన ఫ్లిప్‌కార్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేరళలోని ఎర్నాకుళం జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఈ ఏడాది ఆగస్ట్ 8 నుంచి అక్టోబర్ 10 మధ్య నకిలీ చిరునామాలు, వేర్వేరు మొబైల్ నంబర్ల నుంచి రూ. 1.61 కోట్ల విలువైన 332 మొబైల్ ఫోన్లు ఫ్లిప్‌కార్ట్‌లో నిందితులు ఆర్డర్ చేశారు. ఖరీదైన ఆపిల్ ఐఫోన్, శామ్‌సంగ్ గెలాక్సీ, వివో, ఐక్యూవోవో మోడల్స్ ఇందులో ఉన్నాయి. కాగా, ఎర్నాకుళం జిల్లాలోని కంజూర్, కురుప్పంపడి, మెక్కడ్, మువట్టుపుళలోని ఫ్లిప్‌కార్ట్ డెలివరీ హబ్స్ నుంచి 332 మొబైల్ ఫోన్స్ డెలివరీ అయ్యాయి. కంజూర్ హబ్ నుంచి రూ. 18.14 లక్షల విలువైన 38 ఫోన్లు, కురుప్పంపడి హబ్ నుంచి రూ. 40.97 లక్షల విలువైన 87 ఫోన్లు, మెక్కడ్ హబ్ నుంచి రూ. 48.66 లక్షల విలువైన 101 ఫోన్లు, మువట్టుపుళ హబ్ నుంచి రూ. 53.41 లక్షల విలువైన 106 ఫోన్ ఆర్డర్లు వచ్చాయి. అయితే డెలివరీ కేంద్రాలకు చేరుకున్న తర్వాత ఆ మొబైల్ ఫోన్స్ అన్ని మాయమయ్యాయి. మరోవైపు ఫ్లిప్‌కార్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఈ మోసాన్ని గ్రహించారు. రూ. 1.61 కోట్ల విలువైన 332 మొబైల్ ఫోన్స్ మిస్సింగ్‌పై ఎర్నాకుళం రూరల్ సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కంజూర్, కురుప్పంపడి, మెక్కడ్, మువట్టుపుళ ఫ్లిప్‌కార్ట్ హబ్‌లకు ఇన్‌ఛార్జ్‌గా ఉన్న సిద్ధిక్ కే అలియార్, జాస్సిమ్ దిలీప్, హరిస్ పీఏ, మహిన్ నౌషాద్‌లపై పోలీసులు చీటింగ్, ఫోర్జరీ, ఐటీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ మోసంపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# ఈ ఫలితాలు భూకంపం ముందొచ్చే హెచ్చరికలాంటివి

-మొదటిపేజీ తరువాయి

ప్రజల మధ్య కాంగ్రెస్ పార్టీ మనుగడ సాధిస్తోంది. ..పాలైన ఓట్లలో 51 శాతం కాంగ్రెస్ పార్టీకి వచ్చాయి. ప్రజాబలం కాంగ్రెస్ పార్టీకి చెందింది. 2 సంవత్సరాలు ప్రజలు గమనించి మాకు ఈ తీర్పు ఇచ్చారు. 60 నుండి 65 శాతం ఆదాయం జంట నగరాల నుండే వస్తోంది. రాష్ట్ర అభివృద్ధికి కిషన్ రెడ్డి సహాయనిరాకరణ చేస్తున్నారు. కిషన్ రెడ్డికి వచ్చిన ఓట్లలో 25 శాతం మాత్రమే ఇప్పుడు వచ్చాయి. ఇది భూకంపం వచ్చే ముందు వచ్చే చిన్న ప్రకంపన లాంటిది. ఇప్పుడు అలర్ట్ కాకపోతే కిషన్ రెడ్డి భూ స్థాపితం అవుతారు. ఇప్పటికైనా కిషన్ రెడ్డి తన పద్ధతి మార్చుకోవాలి. ఎవరి పాత్ర ఏంటో, ఎవరి బాధ్యత ఏంటో ప్రజలు స్పష్టంగా చెప్పారు హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతాం. నగరంలో చెత్త ప్రధాన సమస్యగా మారింది. చెరువులు, నాలాలు, కుంటాల కబ్జాలపై దృష్టి పెట్టాం. అసహ్యకరమైన భాషతో అబద్ధాలను బీఆర్ఎస్ ప్రచారం చేసింది. గంజాయి, డ్రగ్స్ లను రూపుమాపడానికి ఈగల్ ఫోర్స్ తీసుకువచ్చాం. కబ్జాలను అడ్డుకోవడానికి హైడ్రా తీసుకువచ్చాం. నగర అభివృద్ధికి బీఆర్ఎస్ సహకరించకపోగా, అడ్డుపడుతోంది. మేం ఎన్నికలప్పుడే రాజకీయ విమర్శలు చేస్తాం. కిషన్ రెడ్డి సచివాలయానికి రండి. కేంద్రంలో పెండింగ్ ఉన్న రాష్ట్ర



అంశాలను చర్చిద్దాం" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అధికారులతో సమీక్ష నిర్వహించి నివేదిక సిద్ధం చేయాలని భట్టి విక్రమార్కకి రేవంత్‌రెడ్డి సూచించారు.

**బిగ్ బాస్ సంబంధిత ఉత్పత్తులు**

..కేటీఆర్ తన అహంకారాన్ని తగ్గించుకోవాలి. హరీష్ తన అసూయను తగ్గించుకోవాలి. కేసీఆర్ కాలికి బలపం కట్టుకొని తిరిగినా మాకు 65 సీట్లు ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో మా ఓటు శాతం పెరిగింది. మేం పార్లమెంట్ ఎన్నికల్లో రెండవ లిట్మస్ టెస్ట్ లో పాస్ అయ్యాం. బీఆర్ఎస్, బీజేపీ కలిసినా మా ఓటు శాతాన్ని చేరుకోలేకపోయారు. హరీష్ చూపులకు శక్తి ఉంటే ఎదుటివాళ్ళు కాలిపోయే ప్రమాదముంది. అధికారం పోయినా కేటీఆర్ కి అహంకారం పోలేదు. చివరి సంవత్సరంలో రాజకీయం చేద్దాం. రెండు సంవత్సరాలు ప్రజల కోసం పనిచేయడానికి సహకరించండి. ఫేక్ న్యూస్ నువ్వే రాయించి, నువ్వే చదివి నిజమనుకుంటే ఎలా?. ఫేక్ సర్వేల వెనుక ఎవరున్నారో నాకు తెలుసు. పక్క రాష్ట్రాల లాగా మీడియాపై దురుసుగా ప్రవర్తించకూడదు అని అనుకుంటున్నాం. మీడియా విశ్వసనీయత పోగొట్టుకోకండి" అంటూ రేవంత్‌రెడ్డి హితవు పలికారు.

**కేసీఆర్ క్రియాశీలకంగా లేరు**

రాజకీయాల్లో కేసీఆర్ క్రియాశీలకంగా లేనందున తాను ఆయన గురించి మాట్లాడనని స్పష్టం చేశారు. ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉన్న నాయకుడిని విమర్శించడం భావ్యం కాదని అన్నారు. అయితే కేటీఆర్‌కు అహంకారం పోలేదని, హరీశ్ రావు అసహనం తగ్గించుకోవాలని హితవు పలికారు. వారి తీరు మారకుంటే ప్రజలు ఎలా అంగీకరిస్తారన్న విషయం అర్థం చేసుకోవాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై కూడా రేవంత్ రెడ్డి స్పందించారు. మంత్రుల అభిప్రాయాలను తీసుకుని స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

# రాహుల్ గాంధీ, కేటీఆర్ ఐరన్ లెగ్స్

-మొదటిపేజీ తరువాయి

ఆలోచించాలని కోరారు. ఇకపై హిందువులందరినీ ఏకం చేసి కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు, బీజేఎల్పీ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి, తమిళనాడు సహ ఇంఛార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మల్క కొమరయ్య, గౌతంరావు, వీరేందర్ గౌడ్, ఎన్వీ సుభాష్, వేముల అశోక్ లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. బీహార్ ఎన్నికల్లో వార్ వన్ సైడ్ అయ్యింది. 200కుపైగా సీట్లు సాధించడాన్ని స్వాగతిస్తూ అక్కడ కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు హృదయపూర్వక అభినందనలు. మోదీ నాయకత్వంపై విశ్వాసం, ఆయన చేస్తున్న అభివృద్ధిని గుర్తించి ప్రజలు పట్టం కట్టారు. కాంగ్రెస్ ఎన్ని తప్పుడు ఆరోపణలు చేసినా బీహార్ ప్రజలు నమ్మలేదు. అభివృద్ధికే పట్టం కట్టారు. కేంద్రంలోని మోదీ నాయకత్వానికి మద్దతిస్తేనే అధిక నిధులు సాధ్యం, అభివృద్ధి సాధ్యమని నమ్మి ఎన్డీఏ కూటమికి అధికారం కట్టబెట్టారు. కాంగ్రెస్ పార్టీ 60 స్థానాల్లో పోటీ చేస్తే 5 సీట్లకే పరిమితమైంది. జాతీయ పార్టీ కాంగ్రెస్ ప్రాంతీయ పార్టీగా మారిపోయింది. రాహుల్ గాంధీ ఇక పబ్జీ ఆడుకోవాల్సిందే. పబ్జీని కేంద్రం నిషేధించినా ఆయన మాత్రం ఇంట్లోనే పబ్జీ గేమ్ ఆడుకుంటాడు.దేశం మొత్తం పోటీ చేస్తామని టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా ప్రకటించుకున్న కేసీఆర్.. పత్తా లేకుండా పోయాడు. చివరకు ఉప ప్రాంతీయ పార్టీగా మారింది. అమిత్ షా చెప్పినట్లుగా అబ్ కీ బార్ 160 పార్ నినాదం సక్సెస్ అయ్యింది. బీహార్ మాది. వచ్చే ఏడాది జరగబోయే బెంగాల్ లో బీజేపీ అధికారంలోకి



రాబోతోంది. 2028లో జరగబోయే తెలంగాణలోనూ కాషాయ జెండాను ఎగరేస్తాం. ఓట్ చోరీపై మాట్లాడుతున్న కాంగ్రెస్ జూబ్లిహిల్స్ లో ఓట్ చోరీ జరగలేదా? చెప్పాలి. రాహుల్ గాంధీ ఇక రాజకీయాలకు సెట్ కాడు. పబ్జీ గేమ్ ఆడుకుంటే బెటర్. తెలంగాణలో హిందువులందరినీ ఏకం చేస్తాం. ముస్లింలంతా ఏకమై జూబ్లిహిల్స్ లో కాంగ్రెస్ కు ఓట్లేసి గెలిపించారు.కాంగ్రెస్ గెలిచినందున 6 గ్యారంటీలు అమలయ్యే అవకాశమే లేదు. ఉద్యోగులకు డీఏ ఇవ్వరు. రిటైర్డ్ ఉద్యోగులకు రిటైర్డ్ మెంట్ బెన్ పిట్స్ రావు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోయినా గెలిపించారని విర్రవీగే అవకాశముంది. ఆ పార్టీ మెడలు వంచి తీరుతాం. లోకల్ బాడీ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతాం.రాష్ట్రంలో కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం మేమేనని చెబుతున్న బీఆర్ఎస్ నేతలను అడుగుతున్నా... అసెంబ్లీకి రాకుండా, ప్రజా సమస్యలపై స్పందించకుండా ఫాంహౌజ్ కే ప్రధాన ప్రతిపక్ష నేత పరిమితమయ్యాడు కదా? మరి ప్రతిపక్ష పార్టీ ఎట్లా అవుతుంది. కంటోన్మెంట్, జూబ్లిహిల్స్ ఎన్నికల్లో సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయిన బీఆర్ఎస్ ప్రతిపక్ష పార్టీ ఎట్లా అవుతుంది? పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు రాలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అసలు పోటీ చేయకుండా పారిపోయింది. మరి ప్రతిపక్ష పార్టీ ఎట్లా అవుతుందో చెప్పాలి.

గత ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ కు డిపాజిట్ కూడా దక్కలేదు. అయినా అధికారంలోకి వచ్చింది. బీజేపీ కూడా జూబ్లిహిల్స్ ఎన్నికల్లో ఆశించిన ఓట్లు రానంత మాత్రాన నిరాశ పడేది లేదు. లోకల్ బాడీ ఎన్నికల్లో సత్తా చాటుదాం. ఎందుకంటే గ్రామాలకు రాష్ట్ర ప్రభుత్వం నయాపైసా కూడా ఇయ్యడం లేదు. అక్కడ అంతో ఇంతో అభివృద్ధి జరుగుతోందంటే కేంద్ర నిధులతోనే. బీజేపీని గెలిపిస్తే కేంద్ర నిధులు వస్తాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడేది, ప్రజా సమస్యలపై నిలదీసే ఏకైక పార్టీ బీజేపీయే. దేశంలో ఐరన్ లెగ్ రాహుల్ గాంధీ. తెలంగాణలో ఐరన్ లెగ్ కేటీఆర్. మాకు బ్రాండ్ అంబాసిడర్లు రాహుల్ గాంధీ, కేటీఆర్ లే. కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయినప్పటి నుండి బీఆర్ఎస్ పతనం కొనసాగుతూనే ఉంది. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 99 సీట్లుంటే 56కి తగ్గిపోయాయి. కేటీఆర్, రేవంత్ రెడ్డి ఒక్కటే. అందుకే మాగంటి గోపీనాథ్ మరణం, ఆస్తులపై విచారణ జరిపించడం లేదు. గోపీనాథ్ ఆస్తులపై కన్నేశారు. ఆ ఆస్తికి సంబంధించి ఆస్తులను బదలాయిస్తే వాటిపై విచారణ జరపాలి. తెలంగాణ ఏర్పడ్డాక ఇప్పటి వరకు 7గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు చనిపోతే ఒక్కటి మినహా అన్నీ అధికార పార్టీయే గెల్చుకుంది.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కొత్త ఉత్సాహం బలాన్నిచ్చింది

-మొదటిపేజీ తరువాయి

మాగంటి సునీత రాజకీయాలకు కొత్త అయినప్పటికీ అద్భుతంగా పనిచేశారని.. పోరాటం చేశారని అన్నారు. ఆమెకు అభినందనలు చెప్పారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.బీఆర్ఎస్ గత రెండేళ్లుగా ప్రధాన ప్రతిపక్షంగా తన పాత్రను అద్భుతంగా పోషించిందని కేటీఆర్ తెలిపారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం ముందు పెట్టడంలో బలంగా బీఆర్ఎస్ పనిచేస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇది కొనసాగుతుందని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నిజాయతీగా కొట్లాడమని స్పష్టం చేశారు. ఎన్నికలు ఎలా జరిగాయో అందరికీ తెలుసని అన్నారు. ప్రతి సర్వేలో బీఆర్ఎస్ గెలుస్తుందని ఎలా చెప్పింది.. ఆఖరి మూడు రోజుల్లో ఏం జరిగిందో ప్రజలు చూశారని అన్నారు. అయినప్పటికీ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నయం బీఆర్ఎస్‌నే అని ప్రజలు స్పష్టం చేశారని తెలిపారు. 2014 నుంచి 2023 వరకు దాదాపు ఏడు ఉప ఎన్నికలు జరిగాయని కేటీఆర్ తెలిపారు. ఈ ఉప ఎన్నికల్లో అప్పటి ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ ఒక్క ఉప ఎన్నికల్లో కూడా గెలవలేదని గుర్తుచేశారు. దాదాపు ఐదింటిలో తాము గెలిచామని అన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలో కూడా ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఒకటి రెండు సీట్లు మాత్రమే వచ్చాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో ప్రజల తరఫున వాదనను బలంగా వినిపించామని కేటీఆర్ తెలిపారు. ప్రజా సమస్యలను, ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లామని పేర్కొన్నారు. హామీల ఎగవేతను బాకీ కార్డుల రూపంలో ప్రధాన చర్చనీయాంశంగా చేయగలిగామని అన్నారు. ఇది బీఆర్ఎస్ సాధించిన విజయమని స్పష్టం చేశారు.

**డైవర్షన్ రాజకీయాలు చేయలేదు**

ఎన్నికల్లో లబ్ధి కోసం కులం, మతం పేరుతో డైవర్షన్ రాజకీయాలు చేయలేదని కేటీఆర్ తెలిపారు. బూతులు అస్సలు మాట్లాడలేదని పేర్కొన్నారు. హుందాగా కేవలం ప్రజాసమస్యలపై మాత్రమే కొట్లాడామని తెలిపారు. జనాలకు అవసరమైన పాయింట్లను మాత్రమే చర్చకు పెట్టామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎంత కవ్వించేందుకు యత్నించినా కూడా సమన్వయం పాటించామని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశామో కూడా తెలిపామని అన్నారు. 5328 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని లెక్కలతో సహా ప్రజల ముందు పెట్టామని అన్నారు. కాంగ్రెస్ ఎగ్గొట్టిన వాటిని కూడా లెక్కలతో సహా ఇంటింటికీ తీసుకెళ్లామని తెలిపారు. బస్సు చార్జీల పెంపుపై నిరసన, బస్తీ



దవాఖానాల్లో పర్యటించి ప్రభుత్వ యంత్రాంగంలో చలనం తీసుకొచ్చాం.. హైడ్రా విధ్వంసంపై ప్రభుత్వాన్ని ఎండగట్టాం.. ఆటో అన్నల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చాం. హైదరాబాద్‌లో రోడ్ల దుస్థితి విషయంలో కూడా ప్రభుత్వాన్ని కదిలించాం. శాంతి భద్రతల విషయంలో కూడా మా నిరసనను తెలిపాం.' అని కేటీఆర్ తెలిపారు. ప్రజా సమస్యలనే కేంద్ర బిందువుగా బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని హుందాగా నిర్వహించిందని అన్నారు. తద్వారా ప్రభుత్వం కూడా మాట్లాడకతప్పని అనివార్యత కల్పించామని తెలిపారు. రెండేళ్లలో ఒక్కసారి కూడా సమీక్ష చేయని ముఖ్యమంత్రి.. ఆఖరి రోజు ఆరు గ్యారంటీల మీద సమీక్ష చేయని పరిస్థితి వచ్చిందంటే అది బీఆర్ఎస్ విజయమే అని స్పష్టం చేశారు. రెండేళ్లలో మైనార్టీలకు స్థానం లేదు.. దీనిపై బీఆర్ఎస్ గట్టిగా మాట్లాడి.. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వాల్సిన అనివార్యతను కల్పించామని అన్నారు.

**ఎన్నికల్లో ఓడిపోయామని నిరాశ లేదు..**

**బలంగా తిరిగొస్తాం**

ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పాత్రను ప్రజలు గమనించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుస్తామని ఆశించామని.. కానీ ఓడిపోయామని తెలిపారు. ఓడిపోయామని తమకు ఎలాంటి నిరాశ లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమిపై విశ్లేషించుకుంటామని.. దీనిపై ఆత్మ విమర్శ చేసుకుంటామని తెలిపారు. ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రెండేండ్లుగా ప్రధాన ప్రతిపక్ష పాత్రను సమర్థవంతంగా పోషిస్తున్నామని కేటీఆర్ తెలిపారు లగచర్ల, హైడ్రా బాధితులు, మూసీ బాధితులు, ఆరు గ్యారంటీల విషయంలో రెండేండ్లుగా ప్రభుత్వంపై బ్రహ్మాండంగా గొంతెత్తి పోరాడమని గుర్తుచేశారు. తమపై చేసిన ఆరోపణలను కూడా సమర్థంగా తిప్పికొట్టామని చెప్పారు. రేపటి రోజు కూడా ఇలాగే ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలో ఈ ప్రభుత్వాన్ని నిలదీయడంలో సఫలమయ్యామని చెప్పారు. గెలవాల్సింది పార్టీలు కాదు.. ప్రజలు అని కేసీఆర్ ఎప్పుడూ చెబుతుంటారని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ ఎన్నిక ఎలా జరిగిందనే దానిపై ప్రజల్లో చర్చ జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. కాంగ్రెస్ ఎన్ని అక్రమాలకు తెరలేపిందో నెల రోజుల ముందే చెప్పామని తెలిపారు. అభ్యర్థి సొంత తమ్ముడికి మూడు ఓట్లు ఉన్న విషయాన్ని ఆధారాలతో సహా ప్రజల ముందు పెట్టామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని.. కోర్టుకు వెళ్లామని తెలిపారు. పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ కోసం ఎన్ని ప్రయత్నాలు చేయాలో అన్ని ప్రయత్నాలు చేశామని అన్నారు. ఏదేమైనా ప్రజాస్వామ్యంలో ప్రజాతీర్పు శిరోధార్యం అని.. దాన్ని తప్పకుండా గౌరవిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ గెలుపు కోసం పనిచేసిన వారందరికీ కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా సోషల్‌మీడియాలో పనిచేసే తమ్ముళ్లు, చెల్లెళ్లకు అభినందనలు చెప్పారు. మీకు ఎలాంటి జీతం ఇవ్వకపోయినా.. పార్టీ మీద, నాయకుడి మీద ప్రేమతో మీరు చేస్తున్న కృషిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమితో నిరాశ పడవద్దని బీఆర్ఎస్ కార్యకర్తలకు సూచించారు. గెలుపోటములు సహజమని తెలిపారు. రబ్బర్ బంతిని గోడకు విసిరితే ఎంత బలంగా తిరిగొస్తుందో.. అలాగే మనం కూడా బలంగా వద్దామని తెలిపారు. కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేదాకా.. శక్తివంచన లేకుండా కష్టపడదామని పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ పార్టీ కోసం నాయకులు, కార్యకర్తలు ఎంతగానో కృషి చేశారని తెలిపారు. ఈ ఎన్నికల సమయంలోనే హరీశ్‌రావు తండ్రి అకాల మరణం చెందారని.. ఇవాళ కూడా తన తండ్రికి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఉన్నాయని.. అయినప్పటికీ పార్టీ కోసమే పనిచేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ రవీందర్ రావు అన్న చనిపోతే కూడా ఆయన ఉదయం వెళ్లి సాయంత్రం వచ్చేశారని తెలిపారు. అంత కమిట్‌మెంట్‌తో నాయకత్వం పనిచేసిందని వెల్లడించారు. వీరిద్దరే కాకుండా ఎంతోమంది ఇలాగే బీఆర్ఎస్ గెలుపు కోసం పనిచేశారని తెలిపారు. తమ కుటుంబాలను వదిలేసి.. దీపావళికి వెళ్లకుండా జూబ్లీహిల్స్‌లోనే మకాం వేసి బీఆర్ఎస్ కోసం పనిచేశారని అన్నారు. వారందరికీ శిరస్సు వంచి నమస్కారాలు పెట్టారు.

## నాపై దుష్ప్రచారం చేసి గెలవాలనుకున్నారు

గతంలో బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి చేయలేదని, ప్రజలకు ఆ విషయం చెప్పుకోలేక తమపై దుష్ప్రచారం చేసి ఎన్నికల్లో గెలవాలని చూసిందని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ అన్నారు. ప్రజలందరూ తమ ఓటుతో బీఆర్ఎస్ పార్టీ దుష్ప్రచారాలను తిప్పికొట్టారని ఆయన అన్నారు. రిటర్నింగ్ అధికారి నుంచి ధృవీకరణ పత్రం అందుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భారీ మెజార్టీతో గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తన విజయం కోసం కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనపై నమ్మకంతో ఓట్లు వేశారని ఆయన అన్నారు. ఈరోజుతో ఎన్నికలు ముగిశాయని, మనమందరం కలిసి మన ప్రాంత అభివృద్ధి కోసం పనిచేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు తనపై తప్పుడు ప్రచారం చేశారని ఆయన ఆరోపించారు. బెదిరిస్తే ప్రజలు ఓటు వేసే రోజులు ఎప్పుడో పోయాయని ఆయన అన్నారు. తనను నమ్మి ఓట్లు వేసిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపిన నవీన్ యాదవ్, నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఘన విజయం

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరోసారి తన ఆధిక్యాన్ని నిరూపించుకుంది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 24,729 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నవీన్ యాదవ్ కు 98,988 ఓట్లు రాగా... బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు 74,259 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డికి 17,061 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇండిపెంటెంట్ అభ్యర్థులుగా పోటీ చేసిన వారిలో బేర బాలకిషన్ కు అత్యధికంగా 175 ఓట్లు వచ్చాయి. నోటాకు 924 మంది ఓటు వేశారు.

## జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారు

**నిజామాబాద్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. 25 వేలకుపైగా ఓట్ల మెజార్టీతో ఆ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ జయకేతనం ఎగరవేశారు. ఈ నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. "జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారు. ఈ విజయం కష్టపడిన ప్రతి కార్యకర్తకు అంకితం. జూబ్లీహిల్స్ తీర్పుతో ప్రజలు %దీ=రా% పార్టీకి సెలవు ప్రకటించారు. రాష్ట్రంలో ఆ పార్టీకి చోటులేదని మరోసారి రుజువైంది. రానున్న రోజుల్లోనూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాపాలన కొనసాగుతుంది. నవీన్‌ను గెలిపించిన ఘనత.. సీఎం, మంత్రులు, ప్రతి కాంగ్రెస్ కార్యకర్తది" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

## బిఆర్ఎస్ తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టిన జూబ్లీహిల్స్ ప్రజలు

**కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**

**సికింద్రాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించిన నేపథ్యంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ గారి ఆధ్వర్యంలో ఎర్రగడ్డ డివిజన్ లో పని చేసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఈరోజు పికెట్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రత్యేకంగా అభినందించి, ఆనందోత్సాహాల మధ్య బాణాసంచా కాల్పులతో హోరెత్తించి, మిఠాయిలు పంచుకున్నారు. సంబురాల అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రివర్గం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంటు సభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు నాయకులు , కార్యకర్తల సహకారంతో అహోరాత్రులు శ్రమించి ప్రజల ఆదరాభిమానాలు చూరగొని జూబ్లీహిల్స్ లో విజయం సాధించామని అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు బిఆర్ఎస్ పార్టీ తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టినందుకు కృతజ్ఞతలు. ఈ విజయంతో మా బాధ్యత మరింత పెరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధికి, బిఆర్ఎస్ పార్టీ తప్పుడు ప్రచారానికి మధ్య జరిగిన ఎన్నికలు ఇవి . జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధి వైపు నిలిచినందుకు వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి జూబ్లీహిల్స్ ప్రజలను వంచించిన బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు . జూబ్లీహిల్స్ ఎన్నికలలో బీఆర్ఎస్ వాళ్లు కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఏ అభివృద్ధి జరగలేదని తప్పుడు ప్రచారాలు చేశారు నేను గాంధీభవన్ లో, జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో జీవోలతో సహా సాక్ష్యాలను చూపించి 6 వేల కోట్ల రూపాయల నిధులను తీసుకువచ్చానని చెప్పడంతో తోక ముడిచి పారిపోయారు . ముఖ్యమంత్రి కూడా ఎన్నికల ప్రచారంలో కంటోన్మెంట్ నియోజకవర్గానికి నా కృషితో వచ్చిన నిధులను ప్రజలకు చెప్పి జూబ్లీహిల్స్ లో కూడా అదే విధంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి మాటలను జూబ్లీహిల్స్ ప్రజలు విశ్వసించి కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించారు . ఇప్పటికైనా బిఆర్ఎస్ నాయకులు బుద్ధి తెచ్చుకుని తప్పుడు ప్రచారాలను మానుకోవాలని నా సలహా. గత పది ఏళ్లలో కంటోన్మెంట్ నియోజకవర్గానికి ఒక్క రూపాయి తీసుకురాని నాయకులు కూడా నేడు తప్పుడు మాటలు మాట్లాడుతున్నారు . ఎమ్మెల్యేగా గెలిచిన 16 నెలల్లోనే ఇన్ని నిధులు తీసుకువస్తే భవిష్యత్తులో నియోజకవర్గాన్ని ఏ మేరకు అభివృద్ధి చేస్తామో ముందు ముందు మీరే చూస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించిన జూబ్లీహిల్స్ ప్రజలకు మరొక్కసారి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు. ఈ సంబురాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జంపన ప్రతాప్, ముప్పిడి మధుకర్, బద్రీనాథ్ యాదవ్, సంతోష్ యాదవ్, అరవింద్ యాదవ్, గౌరీ శంకర్,బల్వంత్ రెడ్డి, నరేష్, మహేష్,సరిత, భవాని, ధనలక్ష్మి,ధనశ్రీ, గోమతి, తదితరులు పాల్గొన్నారు

## బాలసదనంలో బాలల దినోత్సవం పాల్గొన్న సీపీ విజయ్ కుమార్

**సిద్దిపేట :** బాలల దినోత్సవ వేడుకలలో కమిషనర్ ఆఫ్ పోలీస్ ఏం. విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఓ శారదా, డిఆర్ఓ నాగరాజమ్మ, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, డిఎంఅండ్ఎచ్ఓ ధనరాజ్, డిపిఓ వినోద్ కుమార్, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి సాయి తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని కృప భవనం, బాలసదనం, ఆశా జ్యోతి, శిశు గృహ, నిషన్ బాలసదనం పిల్లలు మరియు పాల్గొన్నారు. బాలసదనం చిన్నారుల నృత్య ప్రదర్శన తో అలరించారు. నిషన్ బాలసదనం పిల్లలు భగవద్గీత శ్లోకాలు ఆలకించారు. బాలల దినోత్సవ సందర్భంగా నిర్వహించిన పలు పోటీలలో గెలుపొందిన పిల్లలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఆఫ్ పోలీస్ విజయ్ కుమార్ మాట్లాడుతూ. మన దేశ మొదటి ప్రధాని జవహర్ లాల్ జయంతిని పురస్కరించుకుని వారికి చిన్నారులు అంటే అమితమైన ఇష్టం సందర్భంగా ఈ రోజు బాలల దినోత్సవం జరుపుకుంటున్నాం. ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం బాగా తీసుకోవాలనీ రోజు వ్యాయామం చెయ్యాలని తెలిపారు. ఎప్పుడూ సేఫ్టీ గా ఉండాలంటే మీరు సమాజం లో అసభ్యంగా ప్రదర్శించే ప్రక్రియలను గుర్తించేలా పిల్లలకు గుడ్ మరియు బ్యాడ్ టచ్ ల గూర్చి తెలపాలని అధికారులకు తెలిపారు. మీ పాఠశాల, గురుకుల, సమాజంలో కానీ ఎక్కడ ఎలాంటి నేరాలు నమోదైన ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించిన 100 కి డయల్ చెయ్యాలని తెలిపారు. చైల్డ్ కేర్ సెంటర్ లో ఉంటున్నామని బ్యాడ్ ఫీలింగ్ ఉండకుండదనీ మీ కోసం ప్రభుత్వం వివిధ ఏజెన్సీలు ప్రోత్సాహం వారి సహకారంతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలిపారు. రోజు సమాజం లో జరిగే విషయాలు తెలుసుకోవడం కోసం న్యూస్ పేపర్స్, పలువురు పుస్తకాలు చదవాలనీ తెలుగు, ఇంగ్లీష్, హిందీ పలు భాషలు, చుట్టు పరిసరాలలో జరుగుతున్న విషయాలు నేర్చుకోవాలని నా యొక్క విజ్ఞప్తి. సబ్జెక్ట్ జ్ఞానం కాకుండా బయట విషయాలు సైతం నేర్పించాలని ప్రతి అధికారికి తెలిపారు. ప్రతి ఒక్కరికి జీవితలో ఎలా ఉండాలనుకుంటున్నారో ఒక కల ఉండాలనీ. ఆ కలనుసాకారం చేయడంకోసం ప్రతి రోజు కష్టపడితే లక్ష్యాన్ని చేరుకోవాలని తెలిపారు. మేము కూడా క్విజ్, పేపర్స్, బయట కాంపిటీషన్ అన్ని చూసుకుంటూ చదువుకుని ఈ స్థాయికి వచ్చాము.

# నవంబర్ 14 చలో వరంగల్ సిసిఐ రీజనల్ కార్యాలయం ఎదుట తెలంగాణ పత్తి రైతుల సంఘం ఆధ్వర్యంలో మహాధర్నాను జయప్రదం చేయండి

**సామాన్యుడి అస్త్రం జనగామ :** తెలంగాణ పత్తి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భూక్యా చందు నాయక్ పత్తి రైతుల ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని నవంబర్ 14వ తేదీన చలో వరంగల్ సిసిఐ రీజనల్ కార్యాలయం ఎదుట మహా ధర్నాను జయప్రదం చేయాలని జిల్లా కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఏరియాలో తెలంగాణ పత్తి రైతుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పత్తి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భూక్యా చందు నాయక్ మాట్లాడుతూ తేమతో నిమిత్తం లేకుండా సీసీఐ ద్వారా రైతుల పత్తి పంటను కొనుగోలు చేయాలని, రైతులు పండించిన పత్తి పంటను ఎక్కడైనా స్వేచ్ఛగా విక్రయించే అవకాశం కల్పించాలి. కేంద్ర ప్రభుత్వం విదేశాల నుండి దిగుమతి చేసుకునే పత్తిపై 11 శాతం సుంకాన్ని ఎత్తివేయడాన్ని వెనక్కి తీసుకోవాల కపాస్ కిసాన్ యాప్ వలన కౌలు రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున యాప్ అమలు వెనక్కి తీసుకోవాలని ఈ యాప్ అమలు చేయడం వలన ఒక్కొక్క మిల్లు రోజువారి నిలువ కొనుగోలు చేసిన తర్వాత ఎక్కువ రైతులొస్తే రోజుల తరబడి సీసీ కేంద్రాల వద్ద వెయిటింగ్ చేయడం వలన రైతులకు ట్రాన్స్పోర్ట్ చార్జీలు పెరిగి నష్టపోతున్నారని, సీసీఐ ఆధ్వర్యంలో గతంలో మాదిరిగా ప్రతి ఎకరాకు 12 క్వింటాల్ పత్తిని కొనుగోలు చేయాలి. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఎకరాకు కేవలం 7 క్వింటాల్ కొనుగోలు చేయాలని నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి క్వింటాల్ కు 475/- బోనస్ అమలు చేయాలి. మ్యాపింగ్ పేరుతో కాటన్ మిల్లుల దగ్గరలో ఉన్న గ్రామాల రైతులను సుదూర ప్రాంతాలకు పంపడం వలన ట్రాన్స్పోర్ట్ ఛార్జీలు పెరిగి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కావున అట్టి మ్యాపింగ్ పద్ధతిని సిసిఐ విరమించుకోవాలని 5 నిబంధనల పేరుతో మిల్లర్లను కట్టడి చేయడంలో పేరుతో రైతులకు దగ్గర ఉన్న మిల్లులలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వలన రైతులకు ట్రాన్స్పోర్ట్ చార్జీలు పెరిగి ఇబ్బంది పెడుతున్నారని అదేవిధంగా కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో తెలంగాణ పత్తి రైతుల సంఘం జిల్లా




కన్వీనర్ మంగ బీరయ్య పత్తి రైతులుఅంగడి ఎల్లయ్య ఉర్సుల మల్లయ్య కవిడే ఆంజనేయులు కర్రె రాములు బాలమైన రాములు బక్క అశోక్ అనుగంటి కుమార్ తదితరులు పాల్గొన్నారు

# స్ప్రింగ్ వ్యాలీ గ్లోబల్ స్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవం మరియు ఎరుపు రంగు దినోత్సవ వేడుకలు





**సామాన్యుడి అస్త్రం జనగామ :** స్ప్రింగ్ వ్యాలీ గ్లోబల్ స్కూల్ ఈ రోజు బాలల దినోత్సవం మరియు ఎరుపు రంగు దినోత్సవం రెండింటినీ అత్యంత ఉత్సాహంగా, పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించింది. పాఠశాల ఆవరణ మొత్తం ఎరుపు రంగు సముద్రంలా మారిపోయింది. విద్యార్థులు మరియు సిబ్బంది ఈ థీమ్‌ను ఆనందంగా స్వీకరించారు. విద్యార్థులు ప్రకాశవంతమైన ఎరుపు దుస్తులు ధరించి, ఎరుపు రంగు వస్తువులను తీసుకువచ్చారు. ఆవరణ అంతటా అలంకరించిన ఎరుపు రంగు డెకరేషన్లు, బెలూన్‌లు పండుగ వాతావరణాన్ని మరింత పెంచాయి. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ఛైర్మన్ శ్రీ నలుసాని తిరుపతి రెడ్డి మరియు కరస్పాండెంట్ రావుల ఉపేందర్ బాబు జ్యోతి ప్రజ్వలనతో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా, ఇద్దరు ప్రముఖులు బాలల దినోత్సవం ప్రాముఖ్యత గురించి మరియు ఎరుపు రంగు విశిష్టత గురించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ వేడుకలో విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు, ఇందులో ఆకట్టుకునే ప్రసంగాలు, పాటలు, మరియు నృత్యాలు ప్రదర్శించారు. ఈ వేడుకల్లో ముఖ్యంగా, వివిధ రంగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అకడమిక్స్, క్రీడలు, చేతిరాత, ప్రసంగాలు, వ్యాసరచన వంటి విభాగాల్లో ప్రతిభ చూపిన వారికి ఈ సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమం విద్యార్థులలో సంపూర్ణ అభివృద్ధిని ప్రోత్సహిం చడంలో పాఠశాల నిబద్ధతను ప్రతిబింబించేలా, ఆహ్లాదకరమైన మరియు ఉల్లాస భరితమైన వాతావరణాన్ని విజయవంతంగా సృష్టించింది. ఈ వేడుకలు రోజంతా కొనసాగాయి. పిల్లలు ఈ ఉత్సవాలను పూర్తిగా ఆస్వాదించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన తల్లిదండ్రులకు మరియు విద్యార్థులందరికీ స్ప్రింగ్ వ్యాలీ గ్లోబల్ స్కూల్ యాజమాన్యం మరియు సిబ్బంది తమ కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు

# కేంద్ర ప్రభుత్వ విధానాలు పత్తి రైతులకు నష్టం సీసీ నిబంధనలు సడలించి తెలంగాణ రైతాంగాన్ని ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి

**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామ . కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రైతుల పట్ల తీసుకుంటున్న నిర్ణయాలు తెలంగాణ పత్తి రైతులకు శాపంగా మారిందని పత్తి రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని వెంటనే సిసిఐ నిబంధనలు మార్చి రైతుల నాదుకోవాలని సిపిఎం జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కి శుక్రవారం రోజున పత్తి రైతుల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇవ్వడం ఇవ్వడం జరిగింది అనంతరం కనకా రెడ్డి మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి అప్పుల పాలై వర్షాకాలంలో పత్తి పంట వేయడం జరిగిందన్నారు పకృతి వైపరీత్యాలతో జిల్లాలో పత్తి దిగుబడి తగ్గిందన్నారు చేతికొచ్చిన కొద్దిపాటి పత్తి మిల్లులలో నిర్వహిస్తున్న సిసిఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే తీసే అధికారులు నిబంధన ప్రకారం పత్తిలేదని అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టడం జరుగుతుందన్నారు. తేమ పేరుతో ధరలో కోత పెట్టడంజరుగుతుంది అన్నారు అదేవిధంగా గత సంవత్సరం ఎకరానికి రైతుల వద్ద నుండి 12 క్వింటాళ్లు కొనుగోలు చేస్తే ఈ సంవత్సరం ఏడు క్వింటాళ్లు మాత్రమే తీసుకోవడం వలన ఎక్కువ పంట పడిన రైతులు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవడంతో నష్టం జరుగుతుందన్నారు. ఈ విధానం ఉండడం వలన అన్ని పత్తి మిల్లులకు సీసీఐ కొనుగోలు కేంద్రాలు రాకపోవడంతో వ్యాపారులు నష్టపోవడమే కాకుండా రైతులు కూడా నష్టపోతున్నారని అన్నారు పోటీ ఎక్కువ లేకపోవడంతో కొనుగోలు కేంద్రాల మిల్లులోకి తీసుకుపోతే తక్కువ ధరలకు రైతుల పత్తిని కొనుగోలు చేస్తున్నారు ఈ విధానాన్ని వెంటనే తొలగించి రైతులకు వ్యాపారస్తులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు గుండాల ఆలేరు మోత్కూరు రైతులకు కూడా జనగామలో అమ్ముకునే విధంగా అవకాశం కల్పించాలని అదేవిధంగా ఆన్లైన్ విధానం ఎత్తివేసి పత్తివేసిన రైతులందరికీ పత్తి అమ్ముకునే విధంగా నిబంధనలు సడలించాలని కౌలు రైతులకు కూడా పత్తి అమ్ముకునే విధంగా అవకాశం కల్పించాలని ఎకరానికి 12 గంటల్లో కొనే విధంగా చర్యలు చేపట్టాలని ప్రైవేట్ మిల్లు వ్యాపారస్తులు రెండు శాతం కమిషన్ తీసుకునే పద్ధతి అరికట్టాలని మొంతో తుఫాన్తో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు



మంచినీరు ఉచిత భోజనం అందించే విధంగా మార్కెటింగ్ శాఖ ద్వారా అందించాలని డిమాండ్ చేశారు పత్తి రైతుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాలను కలుపుకొని కేంద్రం మీద ఒత్తిడి తీసుకువచ్చి పత్తి రైతులకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలన్నారు లేని పక్షంలో రైతాంగం పెద్ద ఎత్తున తిరుగుబాటు చేసే పరిస్థితి వస్తుందన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొట్ల శేఖర్ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి జోగు ప్రకాష్ నాయకులు మంగ బీరయ్య కొడిమల ప్రభాకర్ కర్రే సత్తయ్య కొడిమల సిద్ధులు రాజు తదితరులు పాల్గొన్నారు

# సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణను సన్మానించిన కవులు కళాకారుల ఐక్యవేదిక

**సామాన్యుడి అస్త్రం జనగామ :** జనగామ జిల్లాకు వాస్విక్ ఫౌండేషన్ 6వ వార్షికోత్సవానికి.ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ సిబిఐ జెడి లక్ష్మీనారాయణ ను జనగామ జిల్లా కవులు కళాకారు ఐక్యవేదిక ఘనంగా సన్మానించింది. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో జి.వై.గిరి ఫౌండేషన్ జి.కృష్ణ, కవి హృదయం సాహిత్య వేదిక పెట్లోజు సోమేశ్వరా చారి, అభినందన కల్చరల్ సొసైటీ అయిలా సొమనర్సింహచారి, శ్రీ శ్రీ కళావేదిక లగిశెట్టి ప్రభాకర్, తెలంగాణ గౌడ రచయితల సంఘం గడ్డం మనోజ్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలక్టర్ రిజ్వాన్ భాషా షేక్, డి ఎస్.పి రాజమహేంద్ర నాయక్, ప్రజా వైద్యులు కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి,నెల్లుట్ల పౌండేషన్ చైర్మన్ నెల్లుట్ల రవీందర్ రావు,వాస్విక్ పౌండేషన్ నిడిగొండ నరేష్ ప్రజాపతి, నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీతో ఘన విజయం

బావుసాయిపేటలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సంబరాలు



**సామాన్యుడి అస్త్రం కోనరావుపేట :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో ఘన విజయం సాధించడంతో శుక్రవారం బావుసాయిపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎక్కల దేవి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు భారీగా పటాకులు పేల్చి, మిఠాయిలు, పంచుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నందు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సంజీవ్, అనిల్ యాదవ్, గెంటే ప్రవీణ్, జంగం దయాకర్, దేవయ్య, సునీల్, షేక్ కరీం, తిరుపతి నాయక్, మదన్, మహిపాల్, పోచయ్య, భూమయ్య, ఆరే రాజు, తదితరులు పాల్గొన్నారు

## జనగామ అమ్మ క్యాంటీన్



**సామాన్యుడి అస్త్రం జనగామ :** నిర్మల కిరణం షాప్ ఓనర్ బిర్రు నరసింహులు మానవత దృక్పథంతో జనగామ జిల్లా ఆస్పత్రి పరిసర ప్రాంతంలో వైద్యం కోసం వచ్చిన రోగులకు రోగుల బంధువులకు అల్పాహారం అందించారు ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ప్రధాన కార్యదర్శి వంగ భీంరాజు మాట్లాడుతూ ఈరోజు అల్పాహార కార్యక్రమం నిర్వహించిన బిర్రు నరసింహులు కి ధన్యవాదాలు తెలియజేశారు నిత్య అన్నదానం కోసం దాతలు ప్రజలు ముందుకు వచ్చి బియ్యం కూరగాయలు అందించి ఆకలితో ఉన్నవారికి ఒక పూట ఆకలి తీర్చాలని సందర్భం ఏదైనా కానీ జనగామ అమ్మ ఫౌండేషన్ ఆలోచన ఆశయంలో భాగస్వాములు కావాలని భారతదేశంలో ఆకలి చావులు లేకుండా నియంత్రణ లక్ష్యంగా యువత ప్రజలు దాతలు ముందుకు రావాలని కోరారు ఈ కార్యక్రమంలో జనగామ అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు కొయ్యడ రవి ,ఎండి అఫ్రోజ్ పండుగ నరేష్ తుంగ సతీష్, ఉల్లెంగుల మణి బింగి నరసింహులు కొయ్యడ విశ్వ తదితరులు పాల్గొన్నారు

## జనగామ ఆదర్శ హై స్కూల్ లో బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా




**సామాన్యుడి అస్త్రం జనగామ :** జనగామ ఆదర్శ హై స్కూల్ లో బాలల దినోత్సవం ఘనంగా జరిగింది కాసర్ల సంతోష్ గుడాల ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఇంటర్ స్కూల్ చెస్ కాంపిటీషన్స్ జరిగినవి. విజేతలకు బహుమతులు అందించారు. రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ అనే అంశం పై వ్యాసరచన పోటీ అభి గౌడ్ ఆర్టీఏ. మెంబర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. పోటీలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్స్ బహూకరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పిన్నింటి స్వాతి, కరస్పాండెంట్ పిన్నింటి ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం మున్నగు కార్యక్రమాలన్నీ ఘనంగా నిర్వహించబడినవి ఈ కార్యక్రమాలలో ఉపాధ్యాయ బృందం పాఠశాల బాలబాలికలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు

## జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తాత్కాలికమే ప్రభాకర్ రావు



**సామాన్యుడి అస్త్రం జనగామ :** జూబ్లీహిల్స్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలపై స్పందించిన జనగామ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మున్నూరు కాపు సంఘం జనగామ మండల కోఆర్డినేటర్, దివ్యాంగుల ఫోరం జనగామ జిల్లా అధ్యక్షుడు పంతులు ప్రభాకర్ రావు ముఖ్య వ్యాఖ్యలు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో వచ్చిన ఫలితం పూర్తిగా స్థానిక రాజకీయ పరిణామాల వల్ల వచ్చిన తాత్కాలిక ఫలితం మాత్రమే. ఇది ప్రజలు బీఆర్ఎస్‌ను తిరస్కరించినట్లు కాదు తెలంగాణంతటా ప్రజల్లో బీఆర్ఎస్‌కు ఉన్న అభిమానాన్ని ఎవరూ తగ్గించలేరు అని స్పష్టం చేశారు.అలాగే "బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలు తీసుకువచ్చిన అభివృద్ధి, సంక్షేమం, రైతులకు ఇచ్చిన అండ, ఇవన్నీ ప్రజల గుండెల్లో నేటికీ అలాగే ఉన్నాయి. జూబ్లీహిల్స్ ఓటమితో వచ్చిన ఫలితాన్ని ఎవ్వరూ పెద్దగా తప్పుగా బిఆర్ఎస్ ని అర్థం చేసుకోవాల్సిన అవసరం లేదు. బీఆర్ఎస్ తన బలాన్ని, ప్రజాదరణను మరోసారి నిరూపిస్తుంది అని విశ్వాసం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌ను తిరిగి ప్రజల మధ్య మరింత బలంగా నిలబెట్టే దిశగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మేమంతా కష్టపడి పని చేస్తాము అని జనగామ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పంతులు ప్రభాకర్ రావు తెలిపారు పార్టీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా రాష్ట్రస్థాయిలో ప్రజలతో మరింతగా కలిసిపోతామని పంతులు ప్రభాకర్ రావు తెలిపారు

# బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమి భారీ విజయం సాధించిన నేపథ్యంతో జమ్మికుంటలో సంబరాలు

**సామాన్యుడి అస్త్రం జమ్మికుంట:** బీహార్ రాష్ట్రంలో ఈరోజు వెల్లువడిన ఎన్నికల ఫలితాల్లో బీజేపీ నేతృత్వంలోని కూటమి 243 స్థానాలలో దాదాపు 206కి పైగా స్థానాల్లో ఆధిక్యం సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, జమ్మికుంట పట్టణ బీజేపీ అధ్యక్షుడు కొలకాని రాజు ఆధ్వర్యంలో గాంధీ చౌరస్తాలో పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, బీహార్ ఎన్నికలపై "దొంగ ఓట్లు" అంటూ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ప్రజలు ఖండించారని, ప్రజాస్వామ్య బలం ఏదో మరోసారి నిరూపించబడిందని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఇప్పుడు అయినా ప్రజా తీర్పును గౌరవించాలని సూచించారు. అదే విధంగా, దేశ భద్రత, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న పరిపాలన కారణంగానే ఈ భారీ ప్రజాభిమానం లభించిందని నాయకులు అభిప్రాయపడ్డారు. రాబోయే తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీజేపీ పార్టీ బలమైన స్థానం సంపాదిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల




రాజేందర్, జీడి మల్లేష్, శీలం శ్రీనివాస్, కోరే రవిందర్, పల్లపు రవి, దొంతుల రాజ్ కుమార్, రాజేష్ ఠాకుర్, కైలాసకొటి గణేష్, తూడి రవించందర్ రెడ్డి, మోతె స్వామి, ఇటుకాల స్వరూప, బచ్చు శివన్న, శనిగరపు రవి, బూరుగుపల్లి రాము, రాచపల్లి ప్రశాంత్, గర్రెపల్లి నిరుప రాణి, ఎదులపురం అశోక్, కొండాపర్తి ప్రవీణ్, అప్పాల రవిందర్, శ్రీవర్తి అఖిల్, పొనగంటి రవి, ఎమనగండ్ల రామస్వామి, యాంసాని సమ్మయ్య, ఆకుల పోచయ్య, తిరుపతి, సిరియాల విజయ్, చందా సంతోష్ తదితరులు పాల్గొన్నారు

# ఏ ఎన్నికైనా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకే విజయం

**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ మెజారిటీతో విజయాన్ని సాధించిన సందర్భంగా, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు ఇల్లందకుంట మండల కేంద్రంలో విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో స్వీట్స్ పంపిణీ చేసి, బాణాసంచా కాల్చి సంబరాలు జరిపారు.

**నాయకులు మాట్లాడుతూ**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ అఖండ మెజారిటీలతో గెలవడం, సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క నాయకత్వంలో రూపుదిద్దుకున్న పకడ్బందీ వ్యూహానికి నిదర్శనమని అన్నారు. మంత్రివర్గం, రాష్ట్ర నాయకత్వం సమిష్టి కృషితోనే ఈ ఘన విజయం సాధ్యమైందని వ్యాఖ్యానించారు.

**తదుపరి మాట్లాడుతూ**

గత కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చి వెళ్లిపోయిందని, అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ముందుచూపుతో పెట్టుబడులను తీసుకొస్తూ, అభివృద్ధిసంక్షేమ పథకాలను సమతులంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధికి పట్టం కట్టిన జూబ్లీహిల్స్ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చేసిన అబద్ధపు ప్రచారాలను ప్రజలు తిరస్కరించారని,




10 సంవత్సరాల కెసీఆర్ పాలనలో కుటుంబ అభివృద్ధి తప్ప రాష్ట్ర అభివృద్ధి జరగలేదని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడమే కాకుండా తెలంగాణ అస్థిత్వాన్ని, అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. ఇకపై బీఆర్ఎస్ నాయకత్వం వక్రబుద్ధిని మార్చుకోవాలని, సోషల్ మీడియాలో అబద్ధాలు పేర్చి ప్రజలను తప్పుదోవ పట్టించాలనే ప్రయత్నాలు చేస్తే కాంగ్రెస్ సైనికులు భరించబోమని హెచ్చరించారు. అభివృద్ధి వ్యతిరేక శక్తులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి, వచ్చే ఏ ఎన్నికల్లో అయినా కాంగ్రెస్ పార్టీకి ఘన విజయం అందిస్తామని శపథం చేశారు.

**కార్యక్రమంలో పాల్గొన్నవారు:**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

# జూబ్లిహిల్స్ గెలుపు కాంగ్రెస్ అభివృద్ధికి మలుపు

**సామాన్యుడి అస్త్రం హుజూరాబాద్ :** జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ బంపర్ విక్టరీ సోమాజిగూడ డివిజన్ 288 బూత్‌లో కాంగ్రెస్‌కు స్పష్టమైన ఆధిక్యం సెంటిమెంట్ రాజకీయాలు చేసినా బీఆర్ఎస్ విఫలం ప్రజలు అభివృద్ధి పక్షాన తీర్పు ఈ విజయం కాంగ్రెస్‌లో నయా జోష్‌కు నాంది జూబ్లిహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి అభివృద్ధి దిశగా కీలక మలుపు అని, ప్రజలు ఇచ్చిన తీర్పు పార్టీపై మరింత బాధ్యతను మోపిందని హుజూరాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో జరిగిన వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు, గత రెండు సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను స్పష్టంగా ప్రజల ముందుంచామని తెలిపారు. జూబ్లిహిల్స్ ఫలితాలు ప్రజలు అభివృద్ధినే ఎంచుకున్నారని మరోసారి రుజువైందని అన్నారు. ఉప ఎన్నికల ప్రచారంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ తో కలిసి విస్తృతంగా ప్రచారం చేసిన ప్రణవ్, సోమాజిగూడ 288 బూత్‌లో కాంగ్రెస్ మంచి మెజారిటీ సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ అక్కడి ప్రజలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బీసీలపై నిజమైన కమిట్మెంట్ ఉన్న పార్టీగా కాంగ్రెస్ మళ్లీ నిరూపించుకుందని చెప్పారు. జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలో బీసీ వర్గానికి చెందిన నవీన్ కుమార్ యాదవ్ ను అభ్యర్థిగా నిలబెట్టడం ద్వారా బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీ నిజమైన చిత్తశుద్ధి స్పష్టమైందని పేర్కొన్నారు. విజేతగా ఎన్నికైన నవీన్ కుమార్ యాదవ్‌కు ప్రణవ్ హార్ధిక శుభాకాంక్షలు తెలియజేశారు. విజయోత్సవం గా హుజూరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. ప్రధాన కూడళ్లలో బాణాసంచా కాల్చి, కార్యకర్తలు ఒకరికి ఒకరు మిఠాయిలు పంచుకున్నారు. బీఆర్ఎస్ అబద్ధపు



ప్రచారాలు, సెంటిమెంట్ రాజకీయాలు చేసినా జూబ్లిహిల్స్ ప్రజలు వాటిని తిరస్కరించి, అభివృద్ధికి పట్టం కట్టారని ప్రణవ్ అన్నారు. ఇదే జోష్‌తో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అన్ని స్థానాలను గెలుచుకునే ధైర్యం కాంగ్రెస్‌కు ఉందని ధీమా వ్యక్తం చేశారు

# జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, జూబ్లీహిల్స్ నియోజకవర్గం

**సామాన్యుడి అస్త్రం జమ్మికుంట:** కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా జమ్మికుంట గాంధీ చౌరస్తాలో భారీగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు టపాసులు కాల్చి, మిఠాయిలు పంచి, సౌండ్ సిస్టమ్‌లతో ఉత్సాహంగా సంబరాలు జరిపారు. పార్టీ నాయకులు మాట్లాడుతూఈ విజయానికి కారణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేకంగా హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబు మరియు జూబ్లీహిల్స్ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఇంతకుముందు రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ప్రజలు సుభిక్షంగా, అభివృద్ధిని అనుభవించినందువల్లే నవీన్ యాదవ్‌కు ప్రజలు భారీ మెజార్టీతో మద్దతు ఇచ్చారని నాయకులు పేర్కొన్నారు. మరియు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు




## మాదిగ రాజకీయ పోరాట సమితి ఎమ్మార్పీఎస్



**సామాన్యుడి అస్త్రం జనగామ :** పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగి నవంబర్ 18న జంతర్ మంతర్ వద్ద మాదిగల అత్మ గౌరవ ప్రదర్శిన (దళితుల) అత్మ గౌరవ ప్రదర్శన జరపాలని న్యూడిల్లి జంతర్ మంతర్ వద్ద పిలుపునివ్వడం జరిగింది. పిలుపులో భాగంగా జాతీయ మాదిగ రాజకీయ పోరాట సమితి జాతీయ వ్యవస్థా యొక్క అధ్యక్షులు బిఎన్ రమేష్ మాదిగ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ నేపథ్యంలో జనగాం జిల్లా ( 14-11- 2025) నాడు .డాక్టర్ బిఆర్. అంభేద్కర్ విగ్రహం వద్ద జనగాం జిల్లా అధ్యక్షులు గోల శోభన్ బాబు ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా పాల్గోని చలో మాదిగ ఛలో డిల్లీ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అతిదులుగ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గద్దెల కుమర్ మాదిగ మరియు సోమరపు ఆయిలయ్య , రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాష్ట పొలిటిబ్యూట్ సబ్యడు ఈరీల్లా శ్రీనివాస్ మాదిగి, రాష్ట్ర కార్యదర్శి తాటికాయల సంపత్, రాష్ట్ర నాయకులు దండెంపెల్లి లోకి సోషల్ మీడియ జనగాం జిల్లా కన్వీనర్ చెరిపెల్ల క్రిష్ణ, గాదెపాక నాగరాజు మాదిగ, హన్మకొండ జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి రాజు మాదిగ, లింగాల గణపురం మండల అధ్యక్షులుఎర్రబెల్లి ఉపేందర్ పాల్గొన్నారు

## అంతర్జాతీయ భగవద్గీత ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి అడ్లురి లక్ష్మణ్ కుమార్

**సామాన్యుడి అస్త్రం ధర్మపురి:** సనాతన ధర్మ ప్రచార సమితి మరియు కొలుముల దామోదర్ యాదవ్ ఎన్ఆర్ఐ కెనడా గార్ల సౌజన్యంతో ఈ నెల 16 తేది హైదరాబాద్ లో 10116 పదివేల నూట పదహారు మందితో సామూహిక భగవద్గీత పారాయణం పోస్టర్ ను ధర్మపురి క్యాంప్ ఆఫీసులో ఆవిష్కరణ చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కార్యక్రమంలో పాల్గొన్న చింతల ప్రదీప్ రెడ్డి,ధర్మారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి,మాజీ చైర్మన్ కొత్త నరసింహులు,కోలుముల పెద్ద గంగన్న,వేల్పుల నాగరాజు,మాజీ సర్పంచ్ తాళ్ల మల్లేశం,ఓరం చిరంజీవి, పుల్ల కోళ్ల లింగమూర్తి చెనల్లి సాయిలు,నేరువాట్ల రమేష్,తదితరులు పాల్గొన్నారు,




## జమ్మికుంటలో సహకార సంఘాల వార్షికోత్సవాల ప్రారంభం

జెండా ఆవిష్కరణలో తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు పాల్గొన్నారు



**సామాన్యుడి అస్త్రం జమ్మికుంట:** నవంబర్ 14 నుండి 20 వరకు జరగనున్న 72వ సహకార సంఘాల వార్షికోత్సవాల భాగంగా, జమ్మికుంట సింగిల్ విండో చైర్మన్ శ్రీ పొనగంటి సంపత్ ఆధ్వర్యంలో జమ్మికుంట ప్రాథమిక సహకార సంఘంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సహకార సంఘాల మాజీ చైర్మన్ మరియు జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది, రైతులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు

## కమలాపూర్‌లో కాంగ్రెస్ వర్గ పోరు: బల్మూరు వెంకట్ వర్గం వొడితల ప్రణవ్ వర్గం

**సామాన్యుడి అస్త్రం కమలాపూర్ :** కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ ఎన్నిక విజయోత్సవ ర్యాలీ ఫ్లెక్సీలో,ప్రణవ్ ఫోటో లేదని రచ్చ రచ్చ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించిన నేపథ్యంలో కమలాపూర్ మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించేందుకు కూడిన సందర్భంలో, ఒక్కసారిగా వర్గ వాదం భగ్గుమంది. ఒక్క పార్టీకి చెందిన నాయకులే అయినా రెండు వర్గాలు ఒకదానిపై ఒకటి పదునుపెట్టి రచ్చరచ్చ చేశాయి. సాంబరాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో వొడితల ప్రణవ్ ఫోటో లేకపోవడం రెండు వర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తతకు కారణమైంది. ఈ విషయంపై బల్మూరు వెంకట్ వర్గం వొడితల ప్రణవ్ వర్గం మధ్య మాటామాటా, ఆరోపణలు, ప్రత్యారోపణలు చోటుచేసుకుని చివరకు తోపులాటలకు దారి తీసింది. ఘట్టం క్షణాల్లో ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు, జోక్యం, చేసుకుని ఇరు వర్గాలను,శాంతింపజేసినారు. ఒకే పార్టీకి చెందిన నాయకులు , స్థానికంగా కాంగ్రెస్ వర్గపోరు మరోసారి వెలుగులోకి వచ్చింది. కాంగ్రెస్ విజయాన్ని సంబరంగా మార్చాల్సిన వేళ, వర్గాల మధ్య ఘర్షణగా మారడంతో కమలాపూర్ మండల కేంద్రమంతా గొడవలతో ముగిసింది





# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఘన విజయం

## నవీన్ యాదవ్‌కు అత్యధిక మెజార్టీ

**ఓటమే మెట్టుగా ఎదిగిన నవీన్ యాదవ్ రాజకీయ ప్రస్థానం..!**

**24,729 ఓట్ల మెజార్టీతో నవీన్ యాదవ్ విజయం**

**జూబ్లీహిల్స్ నియోజకవర్గ చరిత్రలోనే ఇది అత్యధిక మెజార్టీ కావడం గమనార్హం**

**పదేళ్ల వ్యవధిలో 4 సార్లు అపజయం..**



తెలంగాణ రాష్ట్రంలో జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ జయకేతనం ఎగుర వేశారు. తన సమీప ప్రత్యర్థి, బీఆర్?ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై 25 వేల ఓట్లకుపైగా మెజార్టీతో ఆయన గెలుపొందారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ చరిత్రలోనే ఇది అత్యధిక మెజార్టీ కావడం గమనార్హం. ఓట్ల లెక్కింపు మొదలైన దగ్గరి నుంచే నవీన్ యాదవ్ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించారు. రౌండ్ రౌండ్‌కూ అది మరింత పెరిగింది. ఏ ఒక్క రౌండ్‌లోనూ బీఆర్?ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఆధిక్యం దక్కించుకోలేకపోయారు. ఈ గెలుపు రేవంత్‌రెడ్డి సర్కార్‌కు, కాంగ్రెస్ శ్రేణులకు ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. నవీన్ యాదవ్ విజయాన్ని ఈసీ అధికారికంగా ప్రకటించింది. భారత రాష్ట్ర సమితి, బీజేపీ అభ్యర్థులకు 2023 ఎన్నికల కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. బీజేపీకి డిపాజిట్ గల్లంతైంది.

**వ్యూహాత్మకంగా వ్యవహరించిన సీఎం :**

కాంగ్రెస్ విజయంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరించారు. అభ్యర్థి ఎంపిక నుంచి ప్రచారం వరకు దగ్గరుండి పర్యవేక్షించారు. మైనార్టీల్లో మరింత పట్టు కోసం పోలింగ్‌కు కొద్దిరోజుల ముందే అజారుద్దీన్‌కు మంత్రి పదవి కట్టబెట్టారు. డివిజన్ల వారీగా మంత్రులకు బాధ్యతలు అప్పగించి సమన్వయం చేశారు. క్షేత్రస్థాయిలో నేతలు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి శ్రేణుల్లో జోష్ నింపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లేలా సీఎం చర్యలు చేపట్టారు.

**పదేళ్ల వ్యవధిలో 4 సార్లు అపజయం:**

16 ఏళ్ల రాజకీయ జీవితం. పదేళ్ల కాలంలో నాలుగు వరుస ఓటములు. అయినా.. నవీన్ యాదవ్ ఏనాడు రాజకీయాలను వదులుకోలేదు. ఓటములనే ఒక్కొక్క మెట్టుగా చేసుకొని చివరకు విజయ తీరాలకు చేరాడు. తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా మారిన జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి దాదాపు విజయం ఖాయం చేసుకున్నాడు. 8 రౌండ్లు పూర్తయ్యే సరికి 20 వేల మెజార్టీ దాటి గెలుపుకు దగ్గరయ్యాడు. ఇక నవీన్ యాదవ్‌ది సుదీర్ఘ పోరాటం.. పట్టుదలతో కూడిన రాజకీయ ప్రస్థానం. పదేళ్ల వ్యవధిలో నాలుగు సార్లు ఓటమి పాలైనా.. ఏ మాత్రం నిరాశ చెందక నియోజకవర్గ ప్రజలతో మమేకమై పనిచేయడం, సరైన సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం ఆయన విజయానికి సోపానాలయ్యాయి.







## ఓటమే మెట్టుగా ఎదిగిన నవీన్ యాదవ్ రాజకీయ ప్రస్థానం..!

వల్లాల నవీన్ యాదవ్ నవంబర్ 17, 1983న చిన్న శ్రీశైలం యాదవ్, భారతి దంపతులకు జన్మించారు. ఆయన స్వస్థలం యూసుఫ్‌గూడ హైదరాబాద్. నవీన్ బీ.ఆర్క్ (ఆర్కిటెక్చర్) పూర్తి చేశారు. వృత్తిరీత్యా ఆర్కిటెక్ట్, స్థిరాస్తి వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య వర్ష యాదవ్, కుమారుడు అన్ష్ యాదవ్ ఉన్నారు. రాజకీయ జీవితానికి అతీతంగా.. ఆయన నవ యువ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి దాని ద్వారా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో మంచి గుర్తింపు పొందారు. ఇక నవీన్ యాదవ్ రాజకీయ జీవితం ఓటములతో మొదలైంది. ఆయన తొలిసారిగా 2009లో ఎంఐఎం పార్టీ నుంచి యూసుఫ్‌గూడ డివిజన్ కార్పొరేటర్‌గా పోటీ చేశారు. కానీ తెదేపా అభ్యర్థి మురళీ గౌడ్ చేతిలో ఓటమి పాలయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం తరఫున జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుండి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో ఆయన 41,656 ఓట్లు (25.19%) సాధించి, టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించిన మాగంటి గోపీనాథ్ తర్వాత రెండో స్థానంలో నిలిచి తన సత్తా చాటారు. 2015లో మరోసారి ఎంఐఎం అభ్యర్థిగా రహ్మత్‌నగర్ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓటమిని చవిచూశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీ మద్దతు లేకుండా స్వతంత్ర అభ్యర్థిగా జూబ్లీహిల్స్ నుంచి బరిలోకి దిగారు. ఈ ఎన్నికల్లో 18,817 ఓట్లు సాధించాడు. ఆ తర్వాత 2023లో అప్పటి పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సరైన సమయంలో ఆయన తీసుకున్న ఈ నిర్ణయం రాజకీయంగా కీలక మలుపుగా మారింది. ఈ ఏడాది జూన్‌లో మాగంటి గోపీనాథ్ మరణంతో అనివార్యమైన జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన నవీన్ యాదవ్.. విజయం దిశగా దూసుకెళ్తున్నాడు. బీఆర్ఎస్ అభ్యర్థిపై భారీ మెజార్టీతో ముందజలో నిలిచాడు. నియోజకవర్గంపై ఆయనకున్న దశాబ్దాల పట్టు, కాంగ్రెస్ పార్టీపై పెరుగుతున్న ప్రజాభిమానం ఆయనను ఈ చారిత్రక విజయం వైపు నడిపించాయి. నాలుగు ఓటముల తర్వాత చివరకు విజయ తీరాలకు చేర్చాయి.



# నేరాల నియంత్రణ,కేసుల ఛేదనలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

**కోరుట్ల :** ఆధునిక యుగంలో నేరాల నియంత్రణ,కేసుల ఛేదన, ప్రజా భద్రత పరిరక్షణలో సీసీ కెమెరాల వినియోగం అత్యంత కీలకమని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ప్రతి పట్టణం, ప్రతి గ్రామం సీసీ కెమెరాలతో నిండినప్పుడు పోలీసింగ్ మరింత సమర్థవంతంగా మారుతుందని అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా కోరుట్ల పట్టణంలో ఏర్పాటు చేసిన 123 నూతన సీసీ కెమెరాలను శుక్రవారం జిల్లా ఎస్పీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల రక్షణకు, నేరాల అరికట్టడానికి సీసీ కెమెరాలు అమూల్యమైన సాధనాలు అని. ప్రతి వీధి, ప్రతి మూలలా కెమెరాలు అమర్చడం వల్ల నేరం జరిగిన వెంటనే గుర్తించడం, నిందితులను పట్టుకోవడం చాలా వేగంగా జరుగుతోంది అన్నారు. సీసీ కెమెరాలు లేకపోయి ఉంటే కేసులు ఛేదించడంలో ఆలస్యం జరిగేది, కానీ ఇప్పుడు వాటి సహాయంతో విచారణ చాలా వేగంగా జరుగుతోందని అన్నారు. ఇప్పటికే జగిత్యాల ,మెట్ పల్లి, ధర్మపురి,ఈరోజు కోరుట్ల లో పెద్ద మొత్తంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందని సీసీ కెమెరాల ఏర్పాటు వలన దొంగతనాలు, చోరీలు, గొడవలు, రోడ్డు ప్రమాదాలు వంటి ఘటనల్లో నిందితుల కదలికలు రికార్డ్ అయి పోలీసులు వెంటనే గుర్తించి అరెస్టులు చేయగలిగిన అనేక ఉదాహరణలు ఉన్నాయని అన్నారు.కెమెరాలు పోలీసుల 'మూడో నేత్రం'. ఏ సమయంలోనైనా, ఏ చోటైనా నేరాలు జరగకుండా ముందు గానే హెచ్చరికగా పనిచేస్తాయి అని, ఇవి ఉన్నాయన్న భయం నేరస్థుల్లో ఉందని పేర్కొన్నారు.ప్రజలు తమ ఇళ్లకు, వ్యాపార సంస్థలకు, అపార్ట్‌మెంట్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే వ్యక్తిగత భద్రతతో పాటు సమాజ భద్రత కూడా




బలోపేతం అవుతుందని సూచించారు. ప్రత్యేకంగా ప్రధాన రహదారులు, క్రాస్ రోడ్లు, బిజీ సెంటర్లు, మార్కెట్ ఏరియాల్లో కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అవసరం అని తెలిపారు.కొత్తగా కోరుట్ల లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఏర్పాటుకు సహక రించిన స్థానిక డాక్టర్లు ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, ఇతర సంస్థల ప్రతినిధులను జిల్లా ఎస్పీ అభినందించారు. "ఈ వ్యవస్థ ప్రజల సహకారం లేకుండా చేయడం చాలా కష్టం అని, మీరు చూపిన చొరవ అభినందనీయం,ఇదే స్ఫూర్తితో కోరుట్ల పరిసర ప్రాంతాల ప్రజలు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు..ఈ కార్యక్రమంలో మెట్ పల్లి డిఎస్పీ రాములు,కోరుట్ల సీ.ఐ సురేష్ బాబు, ఎస్.ఐ లు చిరంజీవి, రామచంద్రం, స్థానిక వైద్యులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు,వ్యాపారవేత్తలు, పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

**కార్తీకమాసంలో అమ్మవారి దర్శనం ఎంతో ప్రాశస్త్యం**

**లలితమాత ఆలయ ఫౌండరీ ట్రస్ట్ చైర్మన్ చెల్లం స్వరూప**

**జగిత్యాల :** ప్రతి ఒక్కరు దేవాలయాలను సందర్శించి, భక్తిభావాన్నీ పెంపోందించుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని లలితమాత ఆలయ ఫౌండరి చైర్మన్ చెల్లం స్వరూప అన్నారు.కార్తీకమాసం చాలా విశిష్టమైనదని , ఈ మాసంలో అమ్మవారు, శివుడిని దర్శనం చేసుకుంటే మంచి జరుగుతుందన్నారు.లలితామాత ఆలయం,శ్రీ సూర్య ధన్వం తరి ఆలయాల్లో శుక్రవారం సుహాసినీలు ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు.జగిత్యాల పట్టణ చింతకుంట లోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయం లో శ్రీ ధనలక్ష్మి సేవా సమితి అధ్వర్యంలో శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకొని, మాతలు అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, లలితా సహస్ర నామాల స్థోత్ర పారాయణం గావించారు.పారాయణం అనంతరం మాతలు అమ్మ వారికి ఒడి బియ్యం సమర్పిం చారు. కుంకుమ పూజ అనంతరం లక్కీ డిప్ ద్వార ఒక్కరిని ఎంపిక చేసి వారికి అమ్మ వారి శేష వస్త్రం ఆలయ పూజారి ఆశీర్వచనములతో సత్కరించారు. జగిత్యాల రూరల్ మండ లం పొలాసలోని శ్రీ చక్ర సహిత లలితామాత ఆలయంలో




ఫౌండరి ట్రస్ట్ చైర్మన్ చెల్లం స్వరూప ఆధ్వర్యంలో మహిళలు లలితా సహస్రణామ పారాయణం చేసి, శ్రీ చక్రాలకు కుంకుమ పూజలు చేయగా చెల్లం స్వరూప మరకత శ్రీ చక్రానికి భక్తి శ్రద్ధాలతో కుంకుమ పూజ చేశారు.అనంతరం అన్నప్రసాధ వితరణ చేశారు.ఈ కార్యక్రమములో పొలాస ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ చెల్లం స్వరూప సత్తయ్య, , మహేందర్, సత్తయ్య, డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వోడ్నాల శ్రీనివాస్, గంగాధర్,ఉటూరి కళ్యాణి, హరిత, ఉటూరి అర్చన,వోడ్నాల లత, శ్వేత, భీమేశ్వరి, యశోద, గంగమ్మ, గంగమ్మ, అర్చకులు శ్రీహరి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బ్లూ కోల్ట్స్ విభాగంలో పురుషులతోసమానంగా

# రాణిస్తున్న మహిళా పోలీసు కానిస్టేబుళ్లు!

**కరీంనగర్ :** ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతున్న మహిళా పోలీసులు ప్రజలతో పెంపొందుతున్న సత్సంబంధాలు.. మహిళా బ్లూ కోల్ట్స్ పోలీసులు విధుల్లో భాగంగా నిర్వహిస్తున్న స్థానిక సమావేశాలు సత్ఫలితాలిస్తున్నవి.పోలీసులకు సహక రిస్తున్న అన్నీ వర్గాల ప్రజలు కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం. నేరాల నియంత్రణ, సమాచారం అందిన వెంటనే నేరస్థలానికి చేరుకొని సత్వర సేవలందించడం కోసం కరీంనగర్ కమిషనరేట్ లో 2016 డిసెంబర్ 04 వ తేదీన హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ తరహా బ్లూ కోల్ట్స్ సేవలు కరీంనగర్ పోలీసు కమిషనరేట్ వ్యాప్తంగా అప్పటి పోలీసు కమిషనర్ అయిన వి. బి. కమలాసన్ రెడ్డి ప్రారంభించారు. ఈ విభాగం ఏర్పాటుకు ముందు ఎక్కడైనా నేరం జరిగితే , పోలీసులకు సమాచారం తెలిసి వారు సంఘటనా స్థలానికి చేరుకోవడానికి అరగంట నుండి గంట సమయం పట్టేది. ఈ సమస్యను నివారించి, ప్రజలకు అత్యవసర సమయాల్లో, క్షణాల్లో నేరాలు జరిగిన సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకునేలా బ్లూ కోల్ట్స్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే ఈ సేవలు ప్రారంభించి పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిన అనంతరం పోలీసులు అత్యవసర సమయాల్లో బాధితులను చేరుకునే సమయము దూరాన్ని బట్టి 05 నుండి 10 నిమిషాలకు తగ్గింది. ప్రస్తుతం కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా బ్లూ కోల్ట్స్ పోలీసులు స్పందించి, సంఘటన స్థలానికి చేరుకునే సమయం సగటున 07 నిమిషాలుగా వుంది.

ఈ బ్లూ కోల్ట్స్ విభాగానికి చెందిన పోలీసులు తమ విధుల్లో భాగంగా వారి వారి పరిధిల్లోని అన్ని వర్గాల ప్రజలను సమావేశపరిచి కమ్యూనిటీ మీటింగ్స్, ప్రస్తుతం సమాజంలో రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాలు వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఒకవేళ నేరానికి గురైతే వెంటనే మొదటి గంటలోపే గోల్డెన్ అవర్ లో, 1930 కి ఫోన్ చేసి తస్కరించబడిన సొమ్మును ఫ్రీజ్ చేసేలా చర్యలు తీసుకునే అంశాలతో పాటు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం వలన కలిగే నష్టాలూ, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన కలిగే నష్టాలూ, మహిళల భద్రత, ఒంటరిగా ప్రయాణ సమయాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సోషల్ మీడియా వేదికగా జరిగే మోసాలపై, నేరాల నియంత్రణ కొరకు పోలీసులు తీసుకుంటున్న చర్యలు మరియు కమిషనరేట్ వ్యాప్తంగా పోలీసులు తీసుకుంటున్న సంస్కరణల గురించి ప్రజలకు వివరించడం జరుగుతుంది. అంతేకాకుండా నేరాల నిరయంత్రణ మరియు ఛేదనలో సీసీ








కెమెరాల ప్రాముఖ్యతను స్థానిక ప్రజలకు వివరించడం, వాటి ఏర్పాటుకు కృషి చేస్తారు.అయితే గతంతో పోలిస్తే పోలీసుశాఖలో మహిళా పోలీసుల సంఖ్య క్రమంగా పెరగడం జరిగింది. అందుకుగాను మహిళా పోలీసుల వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకుగాను పోలీసు స్టేషన్లో నిర్వహించే విధులతోపాటూ, క్షేత్రస్థాయిలో సైతం విధులు నిర్వహించా లని ప్రస్తుత పోలీసుకమిషనర్ గౌష్ ఆలం నిర్ణయించారు. అందులో భాగంగా గత సెప్టెంబర్ నెల 26వ తేదీ నుండి కమిషనరేట్ వ్యాప్తంగా మహిళా పోలీసులను బ్లూ కోల్ట్స్ విధుల్లో వినియోగించే కార్యక్రమాన్ని సీపీ అధికారికంగా ప్రారంభించారు. అయితే మహిళా బ్లూ కోల్ట్స్ పోలీసులు విధుల్లో భాగంగా నిర్వహిస్తున్న స్థానిక సమావేశాలు సత్ఫలితాలిస్తున్నవని, అన్నీ వర్గాల ప్రజలు పోలీసులకు సహకరిస్తున్నారని తెలిపారు. మహిళా పోలీసు కానిస్టేబుళ్లు, పురుష పోలీసులతో సమానంగా రాణిస్తున్నారన్నారు.

పాయింట్ బుక్ చెకింగ్స్ , రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలిక లపై ఆరాతీయడం, విలేజ్ పోలీసు అధికారిణిగా రాణిం చడం, గ్రామ పంచాయితీల వద్ద మరియు పబ్లిక్ ప్లేసుల్లో పోలీసుల ద్వారా పొందే సేవలను గోడపత్రికలు అతికించి స్థానిక ప్రజలకు తెలియజేయడం చేస్తున్నారని సీపీ తెలిపారు.

**సీపీఆర్ విధానంపై శిక్షణ:**

ఇటీవల వయసుతో సంబంధం లేకుండా గుండెపోటుకు గురై మరణిస్తున్న వారి సంఖ్య పెరుగుతున్నట్లు నిత్యం చూస్తూనే వున్నాము. అది దృష్టిలో ఉంచుకుని కమిషనరేట్ లో పనిచేస్తున్న మహిళా పోలీసు అధికారులు మరియు సిబ్బంది అందరికీ గత నెల సెప్టెంబర్ 26వ తేదీన డి. ఎం.హెచ్ . ఓ. ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యుల సమక్షంలో కమిషనరేట్ కేంద్రంలోని అస్త్ర కన్వెన్షన్ హాలు నందు అకస్మాత్తుగా గుండెపోటు సంభవించిన వ్యక్తికి ప్రథమ చికిత్సలో భాగంగా సీపీఆర్ నిర్వహించే విధానంపై పూర్తి స్థాయిలో శిక్షణ అందించామని సీపీ గౌష్ ఆలం తెలిపారు. అయితే క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే మహిళా బ్లూ కోల్ట్స్ పోలీసులు పూర్తి స్థాయిలో సుశిక్షితులుగా తీర్చిదిద్ది విధుల్లో చేర్చామని సీపీ తెలిపారు. అటువంటి సంఘటన ఎదురైతే బాధితులకు సీపీఆర్ నిర్వహించి ప్రాణాలను కాపాడే నైపుణ్యం వారికీ ఉందని సీపీ ఆశాభావం వ్యక్తం చేసారు. రానున్న రోజుల్లో కమిషనరేట్ ప్రజలకు మరింత నాణ్యమైన పోలీసు సేవలు అందించేందుకు మరింత కృషి చేస్తామన్నారు.

## హుజురాబాద్ టా ప్ర కార్యవర్గ సమావేశం

**పెన్షనరీ ప్రయోజనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్**



**సామాన్యుడి అస్త్రం ప్రతినిధి కమలాపూర్ :** హుజురాబాద్ పట్టణంలోని సైదాపూర్ రోడ్డులో గల టి.ఎ.ప్ర (తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్) కార్యాలయంలో హుజురాబాద్ శాఖ కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ అధ్యక్షత వహించారు.

**సమావేశంలో మాట్లాడుతూ ఆయను**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెన్షన్ సవరణలు, ఆర్థిక బిల్లు 2025, వంటి నిర్ణయాలు పెన్షనర్ల హక్కులను హరించే విధంగా ఉన్నాయని తీవ్రంగా విమర్శించారు. వెంటనే వీటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అంతేకాక, రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 2024 నుండి పదవీ విరమణ పొందిన ఉద్యోగులుఉపాధ్యాయులు అందరికీ కాకుండా కొందరికే పెన్షనరీ బెనిఫిట్స్ మంజూరు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. అర్హులందరికీ వెంటనే పెన్షనరీ ప్రయోజనాలు చెల్లించాలి అని డిమాండ్ చేశారు.అభ్యర్థనలు నెరవేర్చకపోతే టా ప్ర రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు దశలవారీ పోరాట కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు వెంటనే విడుదల చేయాలని, కొత్త పీఆర్‌సీని 2023 జూలై నుండి అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

**సమావేశంలో పాల్గొన్న నాయకులు:**

టా ప్ర హుజురాబాద్ శాఖ ప్రధాన కార్యదర్శి చీకట్ల సమ్మయ్య, కోశాధికారి మండల వీరస్వామి,జిల్లా ఉపాధ్యక్షులు బోంగోని వెంకటయ్య, రావికంటి కిష్టయ్య, కార్యవర్గ సభ్యులు తాటిపాముల కనుకయ్య, గౌరిశెట్టి సాంబయ్య, దొంత హరికిషన్, కంది రాజిరెడ్డి, తౌటం శ్రీహరి, బూర లక్ష్మీనారాయణ, గూడూరు స్వామి రెడ్డి, పెద్దపేట రమేష్, గాజర్ల బుచ్చిరాజం, ముక్కెర కుమారస్వామి, మెంతల ఆది రెడ్డి, మంతెన సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో రిగ్గింగ్, రౌడీయిజం గెలిచాయి

**కాంగ్రెస్‌ది గెలుపే కాదని.. నైతిక విజయం తనదే: మాగంటి సునీతా**

**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో రిగ్గింగ్, రౌడీయిజం గెలిచాయని బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్ అన్నారు. ప్రతిచోట రిగ్గింగ్ చేయడం వల్లనే కాంగ్రెస్ గెలిచిందని తెలిపారు. కాంగ్రెస్‌ది గెలుపే కాదని.. నైతిక విజయం తనది, బీఆర్‌ఎస్‌దే అని ఆమె స్పష్టం చేశారు.జూబ్లీహిల్స్ ఎన్నికల కౌంటింగ్ అనంతరం మాగంటి సునీత మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో అప్రజాస్వామికంగా ఎన్నికలు జరిగాయని అన్నారు. పోలింగ్ రోజున ఎంతో అరాచకం సృష్టించారని తెలిపారు. ఒక మహిళపై అంతమంది రౌడీయిజం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని అన్నారు. నేను ఏం మాట్లాడినా.. కార్యకర్తలను పరామర్శించినా తప్పుగా ప్రచారం చేశారని మండిపడ్డారు. ఇవాళ ఉదయం నుంచే కౌంటింగ్ హాలులో ఆడవాళ్లపై కాంగ్రెస్ ర్యాగింగ్ మొదలుపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిచోట రిగ్గింగ్ చేయడం వల్లనే కాంగ్రెస్ గెలిచిందని అన్నారు. ఒక మహిళపై కాంగ్రెస్ నేతలు రౌడీ రాజకీయం చేశారని అన్నారు. ప్రజలను కాంగ్రెస్ భయభ్రాంతులకు గురిచేసిందని తెలిపారు. గత ఎన్నికలు, ప్రస్తుత ఎన్నికలకు మధ్య తేడా ఏంటో ప్రజలు గమనించారని అన్నారు. తనకు మద్దతుగా నిలిచిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

## సోమశిల ఘటనలో వీరమరణం పొందిన పరదేశి నాయుడును స్మరించిన జిల్లా పోలీసులు

**మహబూబ్ నగర్ :** సోమశిల ఘటనలో వీరమరణం పొందిన అప్పటి ఎస్పీ పరదేశి నాయుడు ను శుక్రవారం నాడు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం, వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో పోలీసులు నివాళులర్పించారు. అయన చిత్రపటానికి , విగ్రహానికి అడిషనల్ ఎస్పీ ఎన్బీ రత్నం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ 1993 నవంబర్ 14న సోమశిల వద్ద జిల్లా ఎస్పీ, సిబ్బంది ప్రయాణిస్తు న్న ప్రభుత్వ బస్సు (ఖీఅ)ను నక్సల్స్ ల్యాండ్ మైన్స్తో పేల్చిన సంఘటనలో పరదేశి నాయుడు, మంది సిబ్బంది వీరమరణం పొందారని అన్నారు. ఈ ఘటనకు నేటితో 32 ఏళ్లు పూర్తైనా ఆ విపరీత దుఃఖం ఇప్పటికీ మరువలేనిదని పేర్కొన్నారు. ఆ సంఘటన పోలీస్ వ్యవస్థలో కలిగించిన బాధాకరమైన జ్ఞాపకాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఆఅఖీః ఆూఖ రమణా రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ బాలరాజు , వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, వుమెన్స్ పీఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐ కృష్ణయ్య, సిబ్బంది మరియు పాల్గొన్నారు.

## వైరా సబ్ రిజిస్టర్ కార్యాలయంపై పలు ఫిర్యాదులు.. ఏసీబీ తనిఖీలు

**ఖమ్మం :** ఖమ్మం జిల్లా వైరాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులు చేపడు తున్న పనులపై ఏసీబీ అధికారులకు ఫిర్యాదులు అందటంతో ఈ దాడులు చేశారు. ఏసీబీ డీజీ ఆదేశాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసీబీ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది ఈ దాడులు నిర్వహించారు. ముందుగా ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంకు అను సంధానంగా పనిచేస్తున్న డాక్యుమెంట్ రైటర్లలపై దాడులు చేసి ఆయా డాక్యుమెంట్ రైటర్ల కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్ల సెల్ ఫోన్లను, సబ్ రిజిస్టార్ కార్యాలయ సిబ్బంది అధికారులు సిబ్బంది ఫోన్లను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఓ సీనియర్ డాక్యుమెంట్ రైటర్ వద్ద సుమారు రూ. 2.90 లక్షల రూపాయల నగదును ఏసీబీ అధికారులకు లభించినట్లు తెలిసింది. ఓ డాక్యుమెంట్ రైటర్ తనకు అప్పు ఇచ్చిన వ్యక్తికి తిరిగి ఆ నగదును ఇచ్చేందుకు తీసుకువచ్చినట్లు తెలిసింది. ఆ నగదుకు సంబంధించిన అన్ని ఆధారాలను అధికారులకు సదరు డాక్యుమెంట్ రైటర్ చూపించినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఏసీబీ ఏసీపీ రమేష్ మాట్లాడుతూ వైరా సబ్ రిజిస్టర్ కార్యాలయం పై పలు ఫిర్యాదులు అందుతుండటంతో ఆఫీస్ మీద ఈ దాడులు చేశామని చెప్పారు. డాక్యుమెంట్ రైటర్లు రిజిస్ట్రేషన్ చేపించిన, తయారు చేసిన, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంట్లను తాము క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని చెప్పారు. డాక్యుమెంట్ రైటర్లతోపాటు, కార్యాలయ అధికారులు, సిబ్బంది ఫోన్లలో నగదు బదిలీ యాప్ లను క్షుణ్ణంగా పరిశీలిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు లంచాన్ని డబ్బు, వస్తు, సేవా రూపంలో అడిగితే ప్రజలు వెంటనే 1064 నెంబర్ కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ ఫోన్ నెంబర్ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటుందని చెప్పారు.



## పాస్ ఉంటేనే లోపలికి అనుమతి

మరికొన్ని గంటల్లో మహేశ్–రాజమౌళి సినిమాకు సంబంధించిన గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్ భారీ లెవల్లో జరగబోతుంది. శనివారం(నవంబరు 15) సాయంత్రం హైదరాబాద్ శివారులో ఈ వేడుక జరగనుంది. గత కొన్నిరోజుల్లో పలు ప్రమాదాలు జరిగిన దృష్ట్యా.. కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించనున్నారు. ఈ క్రమంలోనే డైరెక్టర్ రాజమౌళి ఇప్పటికే వీడియో రిలీజ్ చేసి తగు జాగ్రత్తలు చెప్పారు. ఇప్పుడు హీరో మహేశ్ బాబు వంతు వచ్చింది. పాస్‌పోర్ట్ (ఈవెంట్ పాస్) ఉంటేనే లోపలికి అనుమతి ఉంటుందని, లేదంటే మాత్రం వచ్చేయకండి అని సుతిమెత్తగా చెప్పారు. ఇంకా చాలా ఈవెంట్స్ ఉండనే ఉంటాయని అభిమానులు కంగారుపడొద్దని జాగ్రత్తలు చెప్పారు. 'ఈవెంట్ రోజున ఆర్ఎఫ్‌సీ మెయిన్ గేట్ మూసేసి ఉంటుంది. మీతో పాటు ఉన్న పాస్ స్కాన్ చేస్తే మీరు ఏ గేటు నుంచి రావాలో చూపిస్తుంది. ప్రతి ఒక్కరూ రూల్స్ పాటించండి. పోలీసులకు, సెక్యూరిటీ వాళ్లకు సహకరించండి. పోలీసులు మనకు చెప్పింది ఏంటంటే.. అందరూ ఎంత తక్కువ ట్రాన్స్‌పోర్టేషన్‌తో వస్తే అందరికీ అంత ఈజీగా ఉంటుంది. పాస్‌పోర్ట్ లేకుండా కంగారుపడి వచ్చేయకండి. మనకు ఇంకా చాలా ఈవెంట్స్ ఉంటూనే ఉంటాయి. రేపు సాయంత్రం కలుద్దాం' అని మహేశ్ బాబు చెప్పారు.



## హీరోగా టాలీవుడ్ కమెడియన్.. టైటిల్‌తోనే హైప్!

టాలీవుడ్‌కు ఆణిముత్యంలా దొరికిన కమెడియన్ సత్య. అతని కామెడీ టైమింగ్ చూసి మరో బ్రహ్మనందం దొరికాడంటూ ఇప్పటికే ప్రశంసలొచ్చాయి. అటు నటుడిగా.. ఇటు కమెడియన్‌గా టాలీవుడ్‌లో విపరీతమైన క్రేజ్ తెచ్చుకున్నారు. మత్తు వదలరా మూవీలతో సత్య తానేంటో నిరూపించుకున్నాడు. తెలుగు సినిమా కామెడీకి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయాడు. తాజాగా ఆయన హీరోగా ఎంట్రీ ఇస్తున్నారు. మత్తు వదలరా, హ్యాపీ బర్త్ డే చిత్రాలను తెరెకెక్కించిన రితేశ్ రాణానే సత్యను హీరోగా ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నారు. వీరిద్దరి కాంబోలో వస్తోన్న చిత్రంపై టాలీవుడ్ ప్రియుల్లో ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ మూవీ టైటిల్‌తో పాటు సత్య ఫస్ట్ లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ చిత్రాకి జెట్లీ అనే ఆసక్తికర టైటిల్ ఖరారు చేశారు. చిల్డ్రన్స్ డే సందర్భంగా సత్య ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ టాలీవుడ్ సినీ ప్రియులను తెగ ఆకట్టుకుంటోంది.



## 'అఖండ 2 : తాండవం' తో బాలయ్య మాస్ పండగ మొదలు

నందమూరి బాలకృష్ణ అంటే ప్రత్యేకమైన డైలాగ్ డెలివరీ, పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, మాస్ ఇంపాక్ట్ తప్పక గుర్తుకు వస్తాయి. స్క్రీన్ మీద కనిపిస్తే థియేటర్లు దద్దరిల్లుతాయి. ఇప్పుడు అదే ఎనర్జీని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి బాలయ్య 'అఖండ 2 : తాండవం' తో సిద్ధమవుతున్నాడు. బోయపాటి శ్రీను %-% బాలయ్య కాంబినేషన్ అంటే ఎలాంటి స్థాయి హడావిడి జరుగుతుందో ప్రేక్షకులు బాగా తెలుసు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్‌తో అఖండ సీక్వెల్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. శివతాండవం చేస్తున్నట్టుగా బాలయ్య అద్భుతమైన లుక్ ఉన్న ఫస్ట్ లుక్ పోస్టర్‌కి సోషల్ మీడియాలో అద్భుత స్పందన వచ్చింది. ఆ తర్వాత వచ్చిన టీజర్ మరింత సెన్సేషన్ క్రియేట్ చేసింది. బాలయ్య పవర్, బోయపాటి స్టైల్ ఎలివేషన్స్, తమన్ బ్లాస్టింగ్ బీజీఎం అన్ని కలిపి సినిమాపై అంచనాలు రెట్టింపు చేసింది. పాన్ ఇండియా ఆడియన్స్ కూడా ఈ సీక్వెల్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సినిమాపై భారీ అంచనాల నడుమ ఇప్పుడు మేకర్స్ ముంబై పీవీఆర్ జుహూలో 'అఖండ 2' ఫస్ట్ సింగిల్‌ను గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ఇప్పటి వరకు బాలయ్య సినిమాలు హైదరాబాద్ లేదా ఆంధ్రా/తెలంగాణలో ప్రమోషన్స్ చేసేవి. కానీ ఈసారి పాన్ ఇండియా టార్గెట్‌తో నేరుగా ముంబైలో ఈవెంట్ ప్లాన్ చేయడం హాట్ టాపిక్ గా మారింది. ఇదే ఈవెంట్‌తో సినిమా ప్రమోషన్స్ దేశవ్యాప్తంగా అధికారికంగా ప్రారంభం కానున్నాయి. సంగీత దర్శకుడు ఎస్.తమన్ మొదటి భాగంలో అందించిన %బీ+వీ% ఇప్పటికీ కల్ట్ లెవెల్ లో ఉంది. ఈసారి కూడా అఖండ రేంజ్‌ను మించిపోయేలా సౌండ్ డిజైన్, %బీ+వీ%, పాటల్లో తన బెస్ట్ ఇచ్చాడు. నాలుగు నిమిషాల పాటు సాగిన ఈ పాటలో బాలకృష్ణ పవర్ ఫుల్ లుక్‌లో కనిపిస్తూ ప్రేక్షకులకి మంచి అనుభూతి అందించాడు. బాలయ్య మాస్ ఇంపాక్ట్‌ను థియేటర్లలో ఎన్నడూ లేని విధంగా అనుభూతి చెందించేలా తమన్ ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు అర్థమవుతుంది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న 'అఖండ 2 : తాండవం' డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. రిలీజ్‌కు ముందే ఫ్యాన్స్ సోషల్ మీడియాలో "తాండవం మొదలైంది" అంటూ భారీ ట్రెండ్ సృష్టిస్తున్నారు

## స్పోర్ట్స్

## బుమ్రా ధాటికి దక్షిణాఫ్రికా విలవిల..

# తొలి రోజు టీమిండియాదే!

సొంతగడ్డపై మరో టెస్టు సిరీస్‌పై గురిపెట్టిన జట్టు ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఈడెన్ గార్డెన్స్‌లో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ విజేత దక్షిణాఫ్రికాను టీమిండియా వణికించింది. తొలి టెస్టులో జస్ప్రీత్ బుమ్రా(35–27) నిప్పులు చెరగడంతో సఫారీలను 159కే ఆలౌట్ చేసిన భారత్ తొలి రోజు పైచేయి సాధించింది. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన గిల్ సేన వికెట్ కోల్పోయి 37 రన్స్ చేసింది. ఆట ముగిసే సరికి ఓపెనర్ కేఎల్ రాహుల్(13 నాటౌట్), వాషింగ్టన్ సుందర్(6 నాటౌట్) లు క్రీజులో ఉన్నారు. ఇంగ్లండ్ పర్యటనలో సిరీస్ సమం చేసిన టీమిండియా సొంతగడ్డపై జోరు చూపిస్తోంది. వెస్టిండీస్‌ను వైట్‌వాష్ చేసిన భారత్ ఈసారి డబ్ల్యూటీసీ విజేత దక్షిణిఫ్రికాను రెండొందలలోపే కుప్పకూల్చింది. పేస్ ట్రాక్ మీద ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా(5–27) రెచ్చిపోవడంతో సఫారీలు డగౌట్‌కు క్యూ కట్టారు. బుమ్రాకు కుల్దీప్ యాదవ్ తోడవ్వడంతో పర్యాటక జట్టు ఆలౌటయ్యింది. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ ఓపెనర్ యశస్వీ జైస్వాల్(12) వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన వాషింగ్టన్ సుందర్(6 నాటౌట్), కేఎల్ రాహుల్(13 నాటౌట్) మరో వికెట్ పడనీయలేదు. అయితే.. వెలుతురు తగ్గిపోవడంతో త్వరగానే ఆటను ముగించారు. దాంతో.. తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 37 పరుగులు చేసిన టీమిండియా ఇంకా 122 పరుగులు వెనకబడి ఉంది.



**రికెల్టన్‌ను బౌల్డ్ చేసి**

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను ధాటిగా ఆరంభించింది. ఓపెనర్లు రియాన్ రికెల్టన్(23) ఎడెన్ మర్క్‌రమ్(31)లు ధనాధన్ ఆడుతూ భారత్‌పై ఒత్తిడి పెంచాలనుకున్నారు. తొలి వికెట్‌కు 57 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని జస్ప్రీత్ బుమ్రా విడదీసి వికెట్ల వేటకు తెరతీశాడు. మొదట రికెల్టన్‌ను బౌల్డ్ చేసిన యార్కర్ కింగ్ ఆ తర్వాత.. మర్క్‌రమ్‌ను పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత కెప్టెన్ తెంబా బవుమా(3)ను కుల్దీప్ యాదవ్ బోల్తా కొట్టించాడు. 82కే మూడు వికెట్ల పడిన వేళ.. కుర్రాళ్లు టోనీ బ్రిట్జ్(24), ట్రిస్టన్ స్టబ్స్(15 నాటౌట్) సఫారీ టీమ్‌ను ఆదుకున్నారు. వీరిద్దరూ కీలక రన్స్ జోడించి స్కోర్ వంద దాటించారు. అయితే.. ఈ జోడీని విడదీసిన బుమ్రా.. ఆ తర్వాత మరో రెండు వికెట్లు తీసి దక్షిణాఫ్రికా పతనాన్ని శాంసించాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా టెయిలెండర్ల సాయంతో స్టబ్స్ జట్టు స్కోర్ రెండొందలు దాటించాలనుకున్నాడు. కానీ.. హర్మర్, కేశవ్ మహరాజ్(0)లను ఔట్ చేసిన బుమ్రా 159కేసఫారీల ఇన్నింగ్స్ ముగించాడు.

## షమీని వదులుకుంటున్న సన్‌రైజర్స్.. 10 కోట్లకు లక్నో కొంటుందా?



భారత సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ గడ్డుకాలం ఎదుర్కొంటున్నాడు. ఫిట్‌నెస్ చాటుకున్నా సరే అతడికి జాతీయ జట్టులో చోటుదక్కడం లేదు. అసలే సెలెక్టర్ల తీరుతో విసిగిపోతున్న ఈ స్టార్ పేసర్‌కు ఐపీఎల్‌లోనూ షాక్ తగలనుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ అతడిని వదులుకునేందుకు సిద్ధమైంది. రిటెన్షన్ గడువు సమీపిస్తున్న వేళ షమీని ట్రేడ్ పద్ధతిని అమ్మేయాలని ఆరెంజ్ ఆర్మీ భావిస్తోంది. అనుభవజ్ఞుడైన షమీని కొనేందుకు లక్నో సూపర్ జెయింట్స్ ఆసక్తి చూపిస్తోంది. ఈ వెటరన్ కోసం ఇరు ఫ్రాంచైజీల మధ్య చర్చలు నడుస్తున్నాయి. ధర ఫైనల్ అయిందంటే అధికారిక ప్రకటన రేపో మాపో రావడం ఖాయం. ఐపీఎల్ 19వ సీజన్‌కు రిటెన్షన్ గడువు నవంబర్ 15. శనివారం సాయంత్రం 3 గంటల లోపే అట్టిపెట్టుకుంటున్న ఆటగాళ్ల జాబితాను ఖరారు చేసే పనిలో నిమగ్నమయ్యాయి ఫ్రాంచైజీలు. అందులో భాగంగానే ట్రేడ్ డీల్‌ను ఉపయోగించుకుంటున్నాయి పలు జట్లు. తమకు అవసరం లేని,, ఇతర ఫ్రాంచైజీ కోరుకుంటున్న ఆటగాళ్లను స్వాప్ విధానంలో మార్చుకుంటున్నాయి. ఈ క్రమంలోనే పేస్ ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ ను ముంబై ఇండియన్స్‌కు రూ.2కోట్లకు అప్పగించిన లక్నో.. ఈసారి సన్‌రైజర్స్ నుంచి షమీని తీసుకోవాలనుకుంటోంది. నిరుడు వేలంలో అతడిని ఆరెంజ్ ఆర్మీ రూ10 కోట్లకు కొన్నది. సో.. ఇప్పుడు అంతే ధరకు షమీని లక్నోకు అమ్మాలని కావ్యా మారన్ టీమ్ అనుకుంటోంది. ప్రస్తుతం ఇరుజట్ల యజమానుల మధ్య చర్చలు జరుగుతున్నాయి. అదే మొత్తానికి అంగీకరిస్తే.. వచ్చే సీజన్‌లో షమీ లక్నో జెర్సీతో బరిలోకి దిగుతాడు. 18వ సీజన్లో హైదరాబాద్ తరఫున ఆడిన షమీ 14 మ్యాచుల్లో 6 వికెట్లతో నిరాశపరిచాడు.

## 'పసికూన'ను చిత్తు చేసి.. బోణీ కొట్టిన పాకిస్తాన్



ఆసియా క్రికెట్ మండలి నిర్వహిస్తున్న ఏసీసీ మెన్స్ ఆసియా కప్ రైజింగ్ స్టార్స్–2025 టోర్నమెంట్ శుక్రవారం మొదలైంది. దోహా వేదికగా తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్– 'ఏ'– ఒమన్ జట్లు తలపడ్డాయి. వెస్ట్‌ఎండ్ పార్క్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో టాస్ గెలిచిన ఒమన్ తొలుత బౌలింగ్ చేసింది.

**పరుగుల విధ్వంసం**

ఈ క్రమంలో ఆదిలోనే ఓపెనర్ మొహమ్మద్ నయీమ్ (6) వికెట్ కోల్పోయిన పాకిస్తాన్.. తర్వాత అనూహ్య రీతిలో పుంజుకుంది. మరో ఓపెనర్ మాజ్ సదాకత్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 54 బంతుల్లోనే ఐదు ఫోర్లు, తొమ్మిది సిక్సర్లు బాది పరుగుల విధ్వంసం సృష్టించాడు. ఆఖరి వరకు అజేయంగా నిలిచి 96 పరుగులు చేసిన సదాకత్ సెంచరీకి నాలుగు పరుగుల దూరంలో నిలిచిపోయాడు. మిగతా వాళ్లలో యాసిర్ ఖాన్ (26 బంతుల్లో 26), మొహ్మద్ ఫైక్ (9 బంతుల్లో 19) ఫర్వాలేదనిపించగా.. కెప్టెన్ ఇర్ఫాన్ ఖాన్ 21 బంతుల్లోనే 44 పరుగులతో సత్తా చాటాడు. ఆఖర్లో సాద్ మసూద్ మెరుపులు (6 బంతుల్లో 19 నాటౌట్) మెరిపించాడు. ఈ క్రమంలో నిర్ణీత 20 ఓవర్లలో పాక్–ఎ జట్టు కేవలం నాలుగు వికెట్లు నష్టపోయి 220 పరుగులు సాధించింది.

**ఆది నుంచే కష్టాలు**

ఒమన్ బౌలర్లలో షఫీక్ జాన్, ముజాహిర్ రజా, జే ఒడేద్రా, వసీం అలీ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. ఇక భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఒమన్ ఆరంభం నుంచే తడబడింది. ఓపెనర్ సూఫియాన్ యూసఫ్ (3) విఫలం కాగా.. మరో ఓపెనర్, కెప్టెన్ హమ్మద్ మీర్జా (27 బంతుల్లో 34) రనౌట్ అయి వికెట్ పారేసుకున్నాడు. వన్‌డౌన్లో వచ్చిన కరణ్ సోనావాలే (18 బంతుల్లో 26) ఫర్వాలేదనిపించగా.. మిడిలార్డర్‌లో వసీం అలీ (5), నారాయణ్ సాయిశివ్ (1), ఆర్యన్ బిస్త్ (2) పూర్తిగా నిరాశపరిచారు. జై ఒడేద్రా డకౌట్ అయ్యాడు.ఘా

**ఆఖర్లో మెరుపులు..**

ఇలాంటి దశలో జిక్రియా ఇస్లాం, ముజాహిర్ రజా ధనాధన్ దంచికొట్టి జట్టు విజయతీరాలకు చేర్చే ప్రయత్నం చేశారు. జిక్రియా ఇస్లాం మెరుపు అర్ధ శతకం (28 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లు– 57 పరుగులు) సాధించగా.. రజా 24 బంతుల్లో 46 పరుగులతో సత్తా చాటాడు. అయితే, మిగిలిన వారి నుంచి వీరికి సహకారం లభించలేదు.

**బోణీ కొట్టిన పాక్**

ఫలితంగా 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు నష్టపోయి.. ఒమన్ కేవలం 180 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఫలితంగా పాకిస్తాన్ ఒమన్‌పై 40 పరుగుల తేడాతో గెలిచింది. విజయంతో ఏసీసీ మెన్స్ ఆసియా కప్ రైజింట్ స్టార్స్ టీ20 టోర్నీని ఆరంభించింది. మాజ్ సదాకత్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.